మన క్రాంతి
KR TV
ఇది వాస్తవ పత్రిక...




Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి : 01 సంచిక :105 | శనివారం 15 మార్చి 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు : 8 వెల: 3 రూ/-

# ఛాలెంజ్ చేసిన తొడలను బద్దలుకొట్టాం

- పవన్ గర్జన - జనసేన జయకేతనం సభలో హోరాహోరీ ప్రసంగం!
- నిర్బంధాలను ఛేదించి - జనసేన విజయం పై పవన్ క్లారిటీ!
- అసెంబ్లీ గేట్లు బద్దలు కొట్టాం - పవన్ కళ్యాణ్ సంచలన వ్యాఖ్యలు!
- జనసేన 21 ఎమ్మెల్యేలతో శాసనసభలో - ఎన్డీయే కూటమికి బలమైన మద్దతు!




2 లో

పిఠాపురంలోని చిత్రాడలో నిర్వహించిన జనసేన జయకేతనం సభలో పవన్ కల్యాణ్ గర్జించారు. నిర్భంధాలను చిత్తు చేసి.. అధికార పీఠం ఎక్కిన తీరును ప్రస్తావించారు. అన్యాయాన్ని, అక్రమాలపై తన పోరాటం ఎప్పటికీ ఆగదని ఉద్ఘాటించారు. పవన్ తన ప్రసంగం ప్రారంభిస్తూ.. ఎంతో స్ఫూర్తిదాయకమైన పాటను ప్రస్తావించారు. అచ్చమిల్లై.. అచ్చమిల్లై అంటూ సాగే పాటను పాడారు. భయం లేదు.. భయం లేదు.. అంటూ తన ధైర్యానికి కారణాన్ని పేర్కొన్నారు జనసేనాని.

పిఠాపురంలో జనసేన ఆవిర్భావ సభలో పవన్ కళ్యాణ్ ప్రసంగం ఇదే..

ఇల్లేమో దూరం.. చేతిలో దీపం లేదు.. గుండె ధైర్యమే కవచంగా ధరించిన వాడిని కనుకే.. అన్నీ ఒక్కడినే ఐ.. 2014 లో జనసేన పార్టీ స్థాపించాను. భావ తీవ్రత ఉంది కాబట్టే 2018 లో పోరాట యాత్ర చేశాం. ఓటమి భయం లేదు కాబట్టే 2019 లో పోటీ చేశాం. ఓడినా అడుగు ముందుకే వేశాను. మనం నిలబడ్డాం. పార్టీని నిలబెట్టాం. మనం నిలదొక్కుకోవడమే కాకుండా.. నాలుగు దశాబ్దాల టీడీపీని కూడా నిలబెట్టాం. మనం 2019లో ఓడినప్పుడు మీసాలు మేలేశారు, జబ్బలు జరిచారు, తొడలు కొట్టారు. మన ఆడపడుచులను అవమానించారు.

## సమస్యలను ఎత్తిచూపితే

### సస్పెండ్ చేస్తారా..?: మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



2 లో

ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపినందుకు మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి సస్పెన్షన్ చేయడం దారుణమని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బడ్జెట్ సెషన్ పూర్తయ్యేదాకా సస్పెండ్ చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దుష్టపాలన కొనసాగిస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో సమస్యలను ప్రస్తావించకుండా చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆమె ఆరోపించారు.

## ఓర్పు లేని వాళ్ళు మార్పు ఎలా తెస్తారు?

### ఎమ్మెల్సీ కవిత ఆసక్తికర ట్వీట్



2 లో

## శ్రీవారి దర్శనాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలి

### ఎంపీ రఘునందన్ రావు



2 లో

తెలంగాణప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అనుమతించకపోతే, రాష్ట్రంలోని అన్ని స్థాయిల ప్రజాప్రతినిధులు కలిసి తిరుమలలో టీటీడీ అధికారులతో తేల్చుకుంటామని మెదక్ ఎంపీ, బీజేపీ నేత రఘునందన్‌రావు హెచ్చరించారు.

## బీజేపీ నేతలతో రేవంత్ రహస్య భేటీల మర్మమేమి? : కేటీఆర్



'గల్లీలో హోదాను మరిచి తిట్లు.. ఢిల్లీలో చిట్ చాట్లు" అంటూ సీఎం రేవంత్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కాలు గడప దాటదు కానీ.. ఢిల్లీలో మాటలు కోటలు దాటుతున్నాయి అంటూ ట్వీట్ చేశారు. నీళ్లు లేక పంటలు ఎండి- పొలాలు బీడువారి అన్నదాతలు అరిగోస పడుతుంటే.. కనీసం సాగునీళ్లపై సమీక్ష లేకుండా ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నావ్ అంటూ ఎక్స్ వేదికగా కేటీఆర్ నిలదీశారు.

"39 సార్లు ఢిల్లీ పోయి మీడియా ముందు సెల్ఫ్ డబ్బా కొట్టుకునుడు తప్పు.. ఢిల్లీ నుంచి సాధించిన పని.. తెచ్చిన రూపాయి లేదు. రాహుల్ గాంధీతో నీ సంబంధాల గురించి తెలంగాణకు ఏం అవసరం.. మీ మధ్య సంబంధం ఉంటే మాకేంటి–ఊడితే మాకేంటి.. తెలంగాణకు ఒరిగేది ఏంటి?. గ్రామ గ్రామాన, గల్లీ గల్లీల్లో మీకు ఓటేసి మోసపోయాం అని జనం చివాట్లు పెడుతుంటే–చీమకుట్టినట్టు కూడా లేని నువ్వు ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నావ్.. మొహం బాగోలేక అద్దం పగలగొట్టినట్లు.. ఆడ లేక పాతగజ్జెలు అన్నట్లు. హామీల అమలు చేతగాక గాలి మాటలు.. గబ్బు కూతలు." అంటూ కేటీఆర్ దుయ్యబట్టారు.

2 లో

## కాంగ్రెస్ సర్కార్‌కు వ్యతిరేకంగా కదం తొక్కిన గులాబీ శ్రేణులకు ధన్యవాదాలు : కేటీఆర్

అసెంబ్లీ సాక్షిగా అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ సర్కార్‌కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పార్టీ ఒక్క పిలుపునిస్తే రాష్ట్రవ్యాప్తంగా నిరనసలతో కదంతొక్కిన గులాబీ శ్రేణులకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు

2 లో

## ఆ వ్యాఖ్యలను సీఎం వెంటనే వెనక్కి తీసుకోవాలి'..

### మాజీ మంత్రి డిమాండ్




2 లో

## 'కేంద్రానికి దక్షిణాది రాష్ట్రాలపై ఎటువంటి కుట్ర, కక్ష లేదు'

### ఎంపీ డాక్టర్ లక్ష్మణ్

2 లో

## జగదీష్ రెడ్డి చేసింది తప్పు..

### స్పీకర్‌ను విమర్శించడం బీఆర్ఎస్‌కి మంచిది కాదు



2 లో

చట్టసభల్లో ప్రజాస్వామ్యానికి సభకు నాయకుడు ముఖ్యమంత్రి అయితే, సభ మొత్తానికి అధిపతి స్పీకర్ అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అటువంటి స్పీకర్ ని పట్టుకొని సభ మీ ఒక్కడిది కాదు అని మాట్లాడడం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం.. స్పీకర్ మీకు మళ్ళీ అవకాశం ఇచ్చి పొరపాటు అంటుంటే అవును సభ మీది కాదు అని మాట్లాడుతూ కనీసం నన్ను సంప్రదించలేదు అని చెప్పుకోవడానికి అవకాశం కూడా ఇవ్వలేదని బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారు అని ఆయన మండిపడ్డారు.

## హనీట్రాప్ లో పడి...

### పాకిస్తాన్‌కు రహస్య సమాచారం లీక్..

### ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగి అరెస్ట్..



2 లో

అతనొక ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగి.. దేశ భద్రతకు సంబంధించిన కీలకమైన, రహస్యమైన సమాచారంతో డీల్ చేసే శాఖ అది. అంతటి సెన్సిటివ్ డిపార్ట్మెంట్ లో పని చేసేటప్పుడు ఎంత జాగ్రత్తగా ఉండాలి..దేశ భద్రత కోసం కుటుంబాన్ని సైతం పెట్టేంత బాధ్యత, నిబద్ధతతో పని చేయాల్సింది పోయి... ఒక అమ్మాయి మోజులో పడి.. దేశ భద్రతకు సంబంధించిన రహస్య సమాచారాన్ని షేర్ చేశాడు.

## నేటిమాట

మీకోసం వేయించిన రాళ్లను తీసుకుని వాటిని స్మారక స్తూపాన్ని నిర్మించడానికి ఉపయోగించండి.



-రాటన్ టాటా

## సత్తుపల్లి ట్రంక్ పనులను ఈ సంవత్సరంలోపు పూర్తి చేయాలి

సీతారామ ప్రాజెక్ట్ మిగిలిన పనులపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు భేటీ అయ్యారు. సత్తుపల్లి ట్రంక్ పనులు జనవరి నాటికి పూర్తి చేయాలని ప్రతిపాదించారు. సీతమ్మ సాగర్ బ్యారేజి నిర్మాణం పూర్తి చేస్తే జల విద్యుత్ అందుబాటులోకి వస్తుందని నిర్మాణ పనులు వేగవంతం చేయాలని తుమ్మల నాగేశ్వర రావు కోరారు.



2 లో

## సంక్షేమ కార్యక్రమాల అమలులో వివక్ష ఉండదు: సీఎం చంద్రబాబు



2 లో

నామినేటెడ్ పదవుల భర్తీకి కసరత్తు చేస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. పేర్లను సిఫారసు చేసేందుకు కొంతమంది నేతలు ఆలస్యం చేస్తున్నారని చెప్పారు. ఆయా పదవుల కోసం పార్టీకి కష్టపడిన వారి వివరాలు అందించాలని కోరారు. తెదేపాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో సీఎం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.

"సరైన వ్యక్తులను సరైన పదవుల్లో నియమిస్తాం. రాష్ట్రవ్యాప్తంగా 21 ప్రధాన ఆలయాలకు ఛైర్మన్ల నియామకం చేపడతాం.

## ఛాలెంజ్ చేసిన తొడలను బద్దలుకొట్టాం

మొదటి పేజీ తరువాయి

ప్రజలను హింసించారు. ఇదేమి న్యాయం అని మన జనసైనికులు, వీర మహిళలు గొంతెత్తితో వారిపై కేసులు పెట్టి జైళ్లల్లో పెట్టారు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాయకుడిని అక్రమంగా జైలులో బంధించారు. వారి పార్టీ సీనియర్ నాయకులను రోడ్డు మీద రావాలంటే భయపడేలా చేశారు. ఇక నాలాంటి వాడిపై చేయని కుట్ర లేదు, తిట్టని తిట్టు లేదు, వేయని నిందలు లేవు. ఈ ఎన్నికలో అసెంబ్లీ గేటు కూడా తాకలేవు అని ఛాలెంజ్ చేసి తొడలు గొట్టినవారికి బుద్ధి వచ్చేలా ఆ గేట్లను బద్దలు కొట్టాం. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో 21 మంది ఎమ్మెల్యేలు, పార్లమెంట్‌లో ఇద్దరు ఎంపీలతో అడుగు పెట్టాం. దేశమంతా తల తిప్పి తిరిగి చూసేలా వంద శాతం స్ట్రైక్ రేట్‌తో ఘన విజయం సాధించాం. ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని నిలబెట్టాం. ఈరోజు జయకేతనం ఎగురవేస్తున్నాం.

తెలంగాణపై కీలక వ్యాఖ్యలు..

తెలంగాణపై పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ముందుగా ప్రజా యుద్ధ నౌక గద్దర్‌కు పవన్ నివాళులర్పించారు. తెలంగాణ నేల తల్లికి వందనాలు అని చెప్పారు. జనసేన జన్మస్థలం తెలంగాణ.. కర్మస్థానం ఆంధ్రప్రదేశ్ అని పవన్ పేర్కొన్నారు. నా తెలంగాణ కోటి రతనాల వీణ అని పేర్కొన్నారు. కరెంట్ షాక్‌తో చావు బతుకుల్లో ఉంటే.. కొండగట్టు అంజన్న ప్రాణం పోశారని పవన్ చెప్పుకొచ్చారు. జనసేన వీరమహిళలు.. రాణిరుద్రమలు అని పేర్కొన్నారు.

## బీజేపీ నేతలతో రేవంత్ రహస్య భేటీల మర్మమేమి?: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

మరో ట్వీట్‌లో "బీజేపీ నేతలతో కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి రహస్య సమావేశాలా.. సిగ్గు.. సిగ్గు..!. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి అధికారిక సమావేశాలు నిర్వహించాలి కానీ ఈ చీకటి మీటింగులు పెట్టడమేంటి?" అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. ఇలాంటి దిక్కుమాలిన చిల్లర రాజకీయం తెలంగాణ నేలపై ఇంతవరకు ఎప్పుడూ లేదు. ఓ వైపు బయటకు బీజేపీ నేతలతో కుస్తీపడుతున్నట్టు ఫోజులు కొట్టి, దొంగచాటుగా దోస్తీ చేసే ఈ నీచ సంస్కృతికి తెరలేపడం అత్యంత దుర్మార్గం. ఏం గూడుపుఠాణి చేయడానికి ఈ తెరచాటు సమావేశాలు నిర్వహిస్తున్నారో ముఖ్యమంత్రికి దమ్ముంటే బయటపెట్టాలి" అంటూ కేటీఆర్ సవాల్ విసిరారు.

"పంటలు ఎండిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా, గురుకులాల్లో విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నా ఒక్క సమీక్ష నిర్వహించే సమయం లేని సీఎంకు, ఈ రహస్య సమావేశాలకు మాత్రం టైమ్ దొరకడం క్షమించలేని ద్రోహం. కాంగ్రెస్‌లో బీజేపీ కోవర్టులున్నారని రంకెలు వేసే రాహుల్ గాంధీకి, బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యలతో దొరికిపోయిన రేవంత్ రెడ్డిపై చర్య తీసుకునే ధైర్యం ఉన్నదా?. అట్టర్ ఫ్లాప్ ముఖ్యమంత్రిగా ముద్రపడి, ఇక ఏ క్షణంలోనైనా తన సీఎం కుర్చీ చేజారే సూచనలు కనిపించడం వల్లే చీఫ్ మినిస్టర్ బీజేపీతో ఈ చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నట్టు స్పష్టమవుతోంది. ఏడాదిన్నరలోనే రాష్ట్రాన్ని ఆగంచేసి, డర్టీ పాలిటిక్స్ చేస్తున్న ఈ రాబందు రాజకీయాలను తెలంగాణ సమాజం మాత్రం ఎట్టి పరిస్థితుల్లో సహించదు. రెండు ఢిల్లీ పార్టీలకు కర్రుగాల్చి వాతపెట్టది" అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.


## సమస్యలను ఎత్తిచూపితే సస్పెండ్ చేస్తారా..? మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

మొదటి పేజీ తరువాయి

గతంలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఎక్కడ తప్పు మాట్లాడారో చెప్పకుండా జగదీశ్ రెడ్డిని ఎలా సస్పెండ్ చేస్తారని ఆమె ప్రశ్నించారు. ఎక్కడ కూడా స్పీకర్‌ను కించపరిచే విధంగా మాట్లాడలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటుందని ఆమె మండిపడ్డారు. సరైన సమయంలో సరైన గుణపాఠం చెప్తారని తెలిపారు. ఇచ్చినా హామీలను నెరవేర్చమంటే సస్పెండ్ చేసుడేందని ఆమె అడిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగానే సస్పెండ్ చేసిందన్నారు. సభను సజావుగా నడపలేక సభ్యుల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త సాంప్రదాయాలకు తెరలేపుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆమె అన్నారు. కాంగ్రెస్ పాలన ఎమర్జెన్సీని తలపిస్తోందన్నారు. తప్పుడు నిర్ణయాలతో ప్రజల చులకన అవుతున్నారన్న సంగతి మర్చిపోతున్నారని ఆమె పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత పెరిగింది అన్నారు. రైతుల సమస్యలను సర్కార్ పట్టించుకోవడం లేదన్నారు. సమస్యలు ఉన్నాయని ప్రస్తావిస్తే ఏకపక్షంగా సస్పెండ్ చేయడం ఏమిటని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

## SLBC టన్నెల్‌లోకి వెళ్లిన రోబోలు!

SLBC టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్‌లోకి రోబోలు ఎంటర్ అయ్యాయి. టన్నెల్‌లోకి వెళ్లిన అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబో.. మట్టి తవ్వకాలను వేగవంతం చేస్తోంది. ఫలితంగా టన్నెల్‌లో అదృశ్యమైన మిగిలిన కార్మికులను గుర్తించేందుకు రెస్క్యూ టీమ్‌లు శ్రమిస్తున్నాయి.



ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో రెస్క్యూ ఆపరేషన్ 21రోజులుగా కొనసాగుతూనే ఉంది. ప్రధానంగా.. కేరళ కెడావర్ డాగ్స్ గుర్తించిన డీ-1, డీ-2 ప్రాంతాల్లో తవ్వకాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే.. మాన్యువల్ డిగ్గింగ్‌కు బదులుగా ఆటానమస్ హైడ్రాలిక్ పవర్డు రోబోలను వాడుతున్నారు. ఈ రోబో మోడ్రన్ టెక్నాలజీతో టన్నెల్ లోపల డిగ్గింగ్ ప్రక్రియ నిర్వహించనుంది. .

డిగ్గింగ్ ప్రక్రియలో ఏర్పడే మట్టిని వేగంగా బయటకు తీయడానికి సహాయపడతాయి. గంటకు 620 క్యూబిక్ మీటర్ల బురదతో కూడిన మట్టిని కన్వేయర్ బెల్ట్ ద్వారా తరలించనున్నారు అధికారులు. ఈ అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబోకు అనుసంధానంగా ప్రత్యేకమైన యంత్రాలను ఉపయోగిస్తున్నారు. 30 హార్స్ పవర్ సామర్థ్యం గల లిక్విడ్ రింగ్ వాక్యూమ్ పంపు, వాక్యూమ్ ట్యాంకుతో కూడిన మెషిన్‌లను కూడా టన్నెల్ లోపలికి పంపారు. ఈ యంత్రాలు మట్టిని త్వరగా తొలగించేందుకు ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. మరోవైపు.. సహాయక చర్యలకు అడ్డుగా నిలిచిన టీబీఎం వెనక భాగాన్ని గ్యాస్ కట్టర్లు, ప్లాస్మా కట్టర్లు, అల్ట్రా థర్మల్ కట్టర్?లో కత్తిరించి ఎప్పటికప్పుడు ఆ భాగాన్ని లోకో ట్రైన్ ద్వారా బయటకు పంపుతున్నారు.

ఇక.. ఫిబ్రవరి 22న టన్నెల్‌లో ప్రమాదం జరగ్గా 8 మంది చిక్కుకుపోయారు. 16వ రోజున టన్నల్ బోరింగ్ మిషన్ ఆపరేటర్ గురు ప్రీత్ సింగ్ మృతదేహాన్ని మాత్రమే వెలికి తీశారు. పార్థివ దేహాన్ని పంజాబ్?లోని వారి కుటుంబ సభ్యులకు సైతం అప్పగించారు. మిగిలిన ఏడుగురి కోసం రెస్క్యూ ఆపరేషన్ కంటిన్యూ అవుతోంది. ఏడుగురి కార్మికుల జాడ కనిపెట్టేందుకు ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో 12 రకాల సహాయక బృందాలు నిత్యం శ్రమిస్తూనే ఉన్నాయి.

## కాంగ్రెస్ సర్కార్‌కు వ్యతిరేకంగా కదం తొక్కిన గులాబీ శ్రేణులకు ధన్యవాదాలు : కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

ఇవాళ కార్యక్షేత్రంలో మీరు చూపించిన సమరోత్సాహం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకత్వానికి కూడా కొండంత స్ఫూర్తినిచ్చింది. 14 ఏళ్ల ఉద్యమ ప్రస్థానంలో ఎలా ప్రాణాలకు తెగించి పోరాడారో, ఇవాళ ప్రధాన ప్రతిపక్షంగా కూడా తెలంగాణ ప్రజల సమస్యల పరిష్కారం కోసం అంతకు రెట్టింపు తెగువతో మీరు పిడికిలి బిగించిన తీరు అభినందనీయం అని కేటీఆర్ కొనియాడారు.

బీఆర్ఎస్ శాసనసభ్యులు, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక సస్పెండ్ చేసి సభ నుంచి పారిపోయిన కాంగ్రెస్ సర్కార్, ప్రజాక్షేత్రంలో నాలుగు కోట్ల ప్రజల నుంచి మాత్రం తప్పించుకోలేదు. పరిపాలన చేతకేక శాసనసభలో బీఆర్ఎస్ గొంతునొక్కాలని చూస్తున్న ముఖ్యమంత్రికి ప్రజలపక్షాన తప్పకుండా మూడుచెరువుల నీళ్లు తాగిస్తాం అని కేటీఆర్ హెచ్చరించారు.

ఆరు గ్యారెంటీలతో ఆగంచేసి, 420 హామీలతో మభ్యపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని దివాళా దిశగా నడిపిస్తున్న కాంగ్రెస్ సర్కారు పాపం పండింది. బీఆర్ఎస్ ఇవాళ పూరించిన జంగ్ సైరన్ ఆరంభం మాత్రమే. రానున్న రోజుల్లో ఈ మోసకారి ప్రభుత్వం మెడలు వంచేదాకా ఉద్యమపంథాను కొనసాగిద్దాం. ప్రాణాలకు తెగించి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను కాపాడుకునేందుకు ఇలాగే సంఘటితశక్తిగా ముందుకు సాగుదాం అని కేటీఆర్ పిలుపునిచ్చారు. జై తెలంగాణ.. జై బీఆర్ఎస్.. అని కేటీఆర్ నినదించారు.

## ఓర్పు లేని వాళ్ళు మార్పు ఎలా తెస్తారు? ఎమ్మెల్సీ కవిత ఆసక్తికర ట్వీట్

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై నిన్న స్పీకర్ సస్పెన్షన్ వేటు వేసిన విషయం తెలిసిందే. దీనిపై బీఆర్ఎస్ నాయకులు ఘాటుగా స్పందిస్తున్నారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఎక్స్ వేదికగా శుక్రవారం ఆసక్తికర ట్వీట్ చేశారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఓర్పు లేని వాళ్ళు మార్పు ఎలా తెస్తారు ? అని ఆమె ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై గొంతెత్తుతూ, ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపితే సభ నుంచి బహిష్కరిస్తారా ? ప్రజా సమస్యలను శాసనసభలో కూడా లేవనెత్తనివ్వరా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి కి ఇంత అసహనం పనికిరాదు.. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా ప్రజల దృష్టి మళ్లించడానికే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేసినట్లు స్పష్టమవుతోందని అభిప్రాయపడ్డారు. తక్షణమే జగదీశ్ రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

### 'కేంద్రానికి దక్షిణాది రాష్ట్రాలపై ఎటువంటి కుట్ర, కక్ష లేదు'

కేంద్రానికి దక్షిణాది రాష్ట్రాలపై ఎటువంటి కుట్ర, కక్ష లేదని బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ మరోసారి స్పష్టం చేశారు. ఈరోజు(శుక్రవారం) బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఎంపీ లక్ష్మణ్ ప్రెస్ మీట్ లో మాట్లాడారు. ' డీఎంకే ప్రాంతీయ సెంటిమెంట్ ను రెచ్చగొట్టే ప్రయంతం చేస్తోంది. అందులో భాగంగా కేంద్ర పై విషయ ప్రచారం మొదలెట్టింది. కేంద్రానికి దక్షిణాది రాష్ట్రాలపై ఎటువంటి కుట్ర లేదు. డీఎంకే ముసుగులో కాంగ్రెస్ పార్టీ, బీ అర్ ఎస్ పార్టీ లు ఉన్నాయి. దక్షిణాదిలో బీజేపీ బలపడటం చూసి ఈ మూడు పార్టీలు భయపడుతున్నాయి. ఏపీలో ఎన్డీఏ, పుదుచ్చేరి లో బీజేపీ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయి. కర్ణాటకలో గాల్లో దీపంలా సిద్దరామయ్య ప్రభుత్వం ఉంది.డీఎంకే ఆధ్వర్యంలో జరిగే అఖిల పక్షం మీటింగ్ కి రేవంత్, కేటీఆర్ పోటీ పడి హాజరు అయ్యేందుకు సిద్ధమయ్యారు. రేవంత్ ఇచ్చిన 420 హామీల పై అఖిల పక్షం మీటింగ్ పెట్టాలి.

హామీలపై కాంగ్రెస్ ను నిలదీయాల్సిన బీ అర్ ఎస్ కాంగ్రెస్ తో కలిసి అఖిల పక్షం మీటింగ్ కి హాజరు అవ్వడం ఏంటీ?, డిలిమిటేషన్ రాజ్యాంగ బద్దంగా జరిగే ప్రక్రియ. దీనికి రాజకీయాలు అంటగడతార?, బ్రిటిష్ నినాదం విభజించు - పాలించు ను కాంగ్రెస్ అనుసరిస్తుంది. గతంలో అధికార దుర్వినియోగం తో కాంగ్రెస్ బలవంతపు కుటుంబ నియంత్రణ చేపట్టింది. జనాభా తగ్గుదల పై కాంగ్రెస్ కు మాట్లాడే అర్హత లేదు ? , డిలిమిటేషన్ తో ఎస్సీ ఎస్టీలకు సీట్లు పెరుగుతాయి. మహిళలకు 33శాతం సీట్లు దక్కనున్నాయి

మహిళలకు ప్రాధాన్యత ఇవ్వొద్దని రేవంత్ అనుకుంటున్నారా? , కాంగ్రెస్ దొంగ ఏడుపులు ఏడుస్తూ.....జనాభా లెక్కలు అడ్డుకోవాలని చూస్తోంది. దేశాన్ని ఇండియా - పాకిస్తాన్ మాదిరిగా విభజించినట్టు సౌత్, నార్త్ అంటూ ప్రజలను మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్న కాంగ్రెస్.. రేవంత్ 20 - 20 రాజకీయాలు చేయాలని మాట్లాడుతున్నారు. 20 - 20 మ్యాచ్ లో ఎన్నైనా అబద్ధాలు అడొచ్చా?, మొన్న జరిగిన ఢిల్లీ t20 లో మిమ్మల్ని డకౌట్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో రేవంత్ డాకౌట్ అయ్యారు. ఎటువంటి మ్యాచ్ జరిగిన మోదీ సెంచరీలు మోత మోగిస్తున్నారు' అని ఎంపీ లక్ష్మణ్ స్పష్టం చేశారు.

## సత్తుపల్లి ట్రంక్ పనులను ఈ సంవత్సరంలోపు పూర్తి చేయాలి

: సీతారామ ప్రాజెక్ట్ మిగిలిన పనులపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు భేటీ అయ్యారు. సత్తుపల్లి ట్రంక్ పనులు జనవరి నాటికి పూర్తి చేయాలని ప్రతిపాదించారు. సీతమ్మ సాగర్ బ్యారేజి నిర్మాణం పూర్తి చేస్తే జల విద్యుత్ అందుబాటులోకి వస్తుందని నిర్మాణ పనులు వేగవంతం చేయాలని తుమ్మల నాగేశ్వర రావు కోరారు. ఈ సమావేశంలో సత్తుపల్లి ట్రంక్, సీతారామ ప్రాజెక్ట్ పురోగతి, భూసేకరణ, ఖర్చు, నాణ్యత, భవిష్యత్ ప్రణాళికలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రస్తుతం సత్తుపల్లి ట్రంక్ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో, మిగిలిన పనుల పురోగతిని సమీక్షిస్తూ, ప్రాజెక్ట్ నాణ్యత, ఖర్చుల సమీక్ష, పని వేగం తదితర అంశాలను విశ్లేషించారు.

సత్తుపల్లి ట్రంక్ పనులను ఈ సంవత్సరంలోపు పూర్తి చేయాలని, పంప్ హౌస్ 4 నిర్మాణాన్ని కూడా ఈ ఏడాదిలో పూర్తి చేయాలని మంత్రుల ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఖమ్మం, కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌లను ఆదేశించారు. పని నాణ్యత, ఖర్చు నియంత్రణ, పనుల సమయపాలనపై అధికారులు, కాంట్రాక్టర్లు, సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి పెట్టాలి. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమీక్షించి, పనులను మరింత వేగవంతం చేయాలి. ప్రాజెక్ట్ పనుల్లో ఏదైనా సమస్యలు ఎదురైతే వెంటనే సమాచారం అందించాలన్నారు.

రాబోయే మూడు సంవత్సరాలలో బ్యారేజీ నిర్మాణం పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.ఈ బ్యారేజీ ద్వారా 500 %వీఔ - 600 వీఔ% విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా గోదావరి జలాలతో సస్య శ్యామలం చేసే సీతారామ ప్రాజెక్ట్ రానున్న రోజుల్లో కీలకం కానుందనీ మంత్రి తుమ్మల స్పష్టం చేసారు.భవిష్యత్ లో కృష్ణా జలాలు ఇబ్బందిగా మారితే సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు స్థిరీకరణకు సీతారామ ప్రాజెక్ట్ జీవధార గా నిలుస్తుందని, జూలూరుపాడు టన్నెల్ పూర్తయితే పాలేరు రిజర్వాయర్ కు గోదావరి నీళ్ళు చేరితే భవిష్యత్ లో ఉమ్మడి నల్గొండ జిల్లాకు సీతారామ వర ప్రదాయనిగా మారుతుందని మంత్రులు తుమ్మల, ఉత్తమ్ కు వివరించారు. ఇరువురు మంత్రులు దీర్ఘ కాలిక ప్రయోజనాల కోసం రైతాంగం మేలు కోసం సాగు నీటికి బాటలు వేసే పనులు పై కీలక విషయాలు చర్చించినట్లు మంత్రులు తుమ్మల, ఉత్తమ్ తెలిపారు.

## శ్రీవారి దర్శనాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలి - ఎంపీ రఘునందన్ రావు

తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అనుమతించకపోతే, రాష్ట్రంలోని అన్ని స్థాయిల ప్రజాప్రతినిధులు కలిసి తిరుమలలో టీటీడీ అధికారులతో తేల్చుకుంటామని మెదక్ ఎంపీ, బీజేపీ నేత రఘునందన్ రావు హెచ్చరించారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖల ద్వారా భక్తులకు దర్శన అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన డిమాండ్ చేశారు.

శుక్రవారం తిరుమల శ్రీవారిని వీఐపీ బ్రేక్ దర్శనం ద్వారా దర్శించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడిన రఘునందన్ రావు, వేసవి సెలవుల్లో అధిక సంఖ్యలో భక్తులు తిరుమలకు వచ్చేందున, తమ సిఫార్సు లేఖల ద్వారా వీరికి దర్శన అవకాశాన్ని కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. టీటీడీ బోర్డు ఇప్పటికే ఫిబ్రవరి 1వ తేదీ నుంచి తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను ఆమోదిస్తామని ప్రకటించిందని గుర్తు చేశారు.

అంతేకాకుండా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 294 మంది ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలను అంగీకరించిన టీటీడీ, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎమ్మెల్యేలకే ఈ సదుపాయాన్ని పరిమితం చేయడం అన్యాయం అని అన్నారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల లేఖలను సమానత్వంతో అంగీకరించాలని, ఎలాంటి వివక్ష చూపకూడదని కోరారు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు స్వయంగా జోక్యం చేసుకుని, తెలంగాణ ప్రజాప్రతినిధులకు కూడా ఆంధ్రప్రదేశ్ ప్రజాప్రతినిధులతో సమానంగా ప్రాధాన్యత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

## జగదీష్ రెడ్డి చేసింది తప్పు.. స్పీకర్‌ను విమర్శించడం బీఆర్ఎస్‌కి మంచిది కాదు

మొదటి పేజీ తరువాయి

ఇవన్నీ గమనిస్తున్న బీఆర్ఎస్ నాయకత్వం కూడా జగదీశ్వర్ రెడ్డి చేసింది తప్పు.. స్పీకర్ ని సభలో ఇలా మాట్లాడడం మంచిది కాదని చెప్పడం లేదు.. దానికి నిన్న ధర్నాలు చేయడం నియోజకవర్గాల్లో ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ప్రవర్తించిన వాళ్ళే ఈరోజు నిరసనలు తెలుపుతున్నారు అంటూ పొన్నం ప్రభాకర్ విమర్శించారు.

ఇక, రాష్ట్రంలో నిరసనలకు బీఆర్ఎస్ పిలుపునివ్వం హాస్యాస్పదం అని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడడానికి కనీసం జ్ఞానం అయినా బీఆర్ఎస్ పార్టీకి రావాలి అని పేర్కొన్నారు. సభలో ఏ విధంగా ఉండాలి సభ వేదికపై ఏ విధంగా ప్రవర్తించాలో తెలిసి కూడా ఇలా చేస్తున్నారంటే ఇది ఉద్దేశ్యపూర్వకంగా చేస్తున్నారు అని అనేది అర్థం అవుతుంది.. ఇది ప్రజలు గమనించాలి.. సభకు కొన్ని సంప్రదాయాలు పద్ధతులు ఉంటాయి.. ఉదాహరణకు అబద్ధం అనడానికి కూడా విలు లేదు సత్య దూరం.. శాసన సభలో కొన్ని అంశాలు ఉన్నప్పుడు సభ మీ ఒక్కడిదా అంటే ఆయన శాసన సభకు అధిపతి అందులోనే అర్థం ఉంది.. దళితుడు కాబట్టి ఆ విధంగా వ్యవహరించారని మాట్లాడుతున్నారు.. ఇదే బీఆర్ఎస్ గతంలో శాసన మండలి చైర్మన్ మీద కాగితాలు పడేసారని ఇద్దరు సభ్యులను తొలగించి బర్తరఫ్ చేశారు.. ప్రజాస్వామ్యంలో ఇది మర్చిపోయారా?.. ఇటువంటి మాటలు, నిరసనలు వద్దు ఎందుకంటే ఇది బీఆర్ఎస్ కి మంచిది కాదని పొన్నం సూచించారు.

## సంక్షేమ కార్యక్రమాల అమలులో వివక్ష ఉండదు: సీఎం చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి

నామినేటెడ్ పదవుల కోసం 60వేల దరఖాస్తులు వచ్చాయి. వాటిని నిశితంగా పరిశీలిస్తున్నాం. మొదటిసారే పదవులు రాలేదని అనుకోవద్దు. రెండేళ్ల పదవీకాలం ముగిశాక మిగిలినవారికి అవకాశాలు కల్పిస్తాం. ఇప్పటికే పదవులు తీసుకున్నవారి ప్రతిభను పర్యవేక్షిస్తున్నాం. ప్రతిపక్షంలో ఉన్నట్లే ఇప్పుడూ హుందాగా వ్యవహరించాలి.

తెదేపా నేతలు ఏ స్థాయిలోనూ వైకాపా నేతలతో సంబంధాలు పెట్టుకోకూడదు. నేను ఇలా చెబితే.. వైకాపాకు ఓటేసిన వారికి పథకాలు ఇవ్వొద్దన్నట్లు ప్రచారం చేస్తున్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో వివక్ష ఉండదు. పార్టీలకు అతీతంగా పథకాలు అందజేస్తున్నాం. సంక్షేమ పథకాలు వేరు.. రాజకీయ సంబంధాలు వేరు. పార్టీలో గ్రూపు రాజకీయాలకు తావివ్వకుండా చూసే బాధ్యత మంత్రులదే. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రులు వారి జిల్లాల్లో పర్యటనల సంఖ్య పెంచాలి. కూటమిలోని మూడు పార్టీల నేతలు, కార్యకర్తలను కలుపుకొని ముందుకెళ్లాలి" అని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

## హనీట్రాప్ లో పడి.. పాకిస్తాన్ కు రహస్య సమాచారం లీక్.. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగి అరెస్ట్..

అతనొక ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగి.. దేశ భద్రతకు సంబంధించిన కీలకమైన, రహస్యమైన సమాచారంతో డీల్ చేసే శాఖ అది. అంతటి సెన్సిటివ్ డిపార్ట్మెంట్ లో పని చేసేటప్పుడు ఎంత జాగ్రత్తగా ఉండాలి..దేశ భద్రత కోసం కుటుంబాన్ని సైతం పెట్టేంత బాధ్యత, నిబద్ధతతో పని చేయాల్సింది పోయి... ఒక అమ్మాయి మోజులో పడి.. దేశ భద్రతకు సంబంధించిన రహస్య సమాచారాన్ని షేర్ చేశాడు. ఎట్టకేలకు ఈ విషయం బయటపడటంతో జైలుకెళ్ళాడు సదరు ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగి. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి.

రవీంద్ర కుమార్ హజరత్ పూర్ లోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో ఛార్జ్ మెన్ గా పని చేస్తున్నారు.అతనికి నేహా శర్మ అనే అమ్మాయి ఫేస్ బుక్ లో పరిచయం అయ్యింది. నేహా శర్మ పాకిస్తాన్ ఇంటెలిజెన్స్ ఏజెంట్ గా పని చేస్తోంది. వారిద్దరి మధ్య స్నేహం పెరిగింది... నేహా శర్మ పాకిస్తాన్ ఇంటెలిజెన్స్ ఏజెంట్ అని తెలిసి కూడా ఆమె మాయలో పడ్డ రవీంద్ర కుమార్.. ఇండియాకు సంబంధించిన రహస్య సమాచారాన్ని నేహాకు ఫేస్బుక్ లో షేర్ చేశాడు.

ఈ విషయం యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ కి తెలియడంతో మార్చి 12న రవీంద్ర కుమార్ ను అదుపులోకి తీసుకున్నారు. అతని దగ్గర నుండి రూ. 6వేలు నగదు, ఎస్బీఐ డెబిట్ కార్డు, రెండు పోస్ట్ ఆఫీస్ డెబిట్ కార్డ్స్, ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఓటర్ ఐడీ స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు అధికారులు. రవీంద్ర కుమార్ డ్రోన్స్, గగన్ యాన్, వంటి కీలక రహస్య సమాచారం నేహా శర్మతో షేర్ చేసినట్లు గుర్తించారు అధికారులు.

## 'ఆ వ్యాఖ్యలను సీఎం వెంటనే వెనక్కి తీసుకోవాలి'.. మాజీ మంత్రి డిమాండ్

సీఎం రేవంత్ చేసిన మార్చురీ వ్యాఖ్యలు అత్యంత హేయమైనవని, వెంటనే వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలని మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. తండ్రి లాంటి కేసీఆర్ మరణం కోరుకుంటారా? అని నిలదీశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో అసెంబ్లీ ఏ విధంగా జరుగుతున్నదో ప్రజలు చూసేవారని.. ఇప్పుడు అసెంబ్లీని కాంగ్రెస్ కౌరవ సభలాగా మార్చిందన్నారు. ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి స్పీకర్‌ను అవమానించలేదని.. చట్టసభలు, స్పీకర్ అంటే బీఆర్ఎస్ పార్టీకి గౌరవం ఉందన్నారు.

దళితులు అంటే గౌరవం వల్లే 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు. సెక్రెటేరియట్‌కు అంబేద్కర్ పేరు పెట్టామన్నారు. అంబేద్కర్ విగ్రహానికి ఇప్పటివరకు సీఎం దండ వేయలేదని ఆరోపించారు. స్పీకర్‌ను అవమానించారని సభా సమయాన్ని వృధా చేశారని.. ఆయన పై ఒత్తిళ్లు ఉన్నాయని అన్నారు. స్పీకర్‌ను వ్యక్తిగతంగా జగదీశ్‌రెడ్డి అన్నట్లు వీడియో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభలో లేకుండా అసెంబ్లీని నడపాలని కుట్ర చేస్తున్నారని అన్నారు.

# మిత్రుడి కూతురు కృషిని గుర్తించి


## ఉన్నత చదువులకు 60 వేల ఆర్థిక సహాయం



**మోత్కూర్ 14మార్చ్ (క్రాంతి న్యూస్ ):** తండ్రి ఆశయాన్ని నెరవేర్చేందుకు, కూతురు కృషిని గుర్తించి, మిత్రబృందం ఆ కుటుంబానికి చేయూతనిచ్చింది. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపాలిటీకి చెందిన మేడిగ రవి మిషన్ కొట్టుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు కుమార్తె మెడికల్ ఎడ్యుకేషన్‌లో మొదటి అడుగు వేసిన సందర్భంగా, 1987–88 ఎస్సెస్సీ బ్యాచ్ మిత్రులు కలిసి ఆమెను శుక్రవారం అభినందించారు. పేదరికం విద్యార్జనకు అడ్డంకి కాకూడదని, రవి కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను గుర్తించిన మిత్రులు, ఆమె విద్యాభ్యాసానికి చేయూత అందించారు. అందరి మిత్రులూ కలసి సుమారు 60,000 రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఒకే తరగతి గదిలో కూర్చొని చదువుకున్న మిత్రులంతా, కాలం గడిచినా తమ బంధాన్ని నిలబెట్టుకుంటూ, ఒకరి కోసం మరొకరు ఆదుకుంటూ ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా మిత్రబృందం మాట్లాడుతూ, కష్టకాలంలో తోడు నిలవడమే నిజమైన స్నేహం. మా మిత్రుడు రవి కూతురు మెడికల్ సీటు సాధించిందని తెలియగానే మేమందరం ఎంతో గర్వించాం. కానీ ఆమె చదువులకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో చిన్న సహాయాన్ని అందించామని అన్నారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయికి ఎదిగి, గొప్ప వైద్యురాలిగా నిలవాలని మనసారా కోరుకుంటున్నాం అని భావోద్వేగంగా తెలిపారు. ఈ స్ఫూర్తిదాయక సంఘటన మోత్కూర్ ప్రాంతంలో అభినందనీయమైంది.

# అంగరంగ వైభవంగా

## శ్రీ శివ పార్వతుల కళ్యాణ మహోత్సవం



**మోత్కూర్ 14మార్చ్ (క్రాంతి న్యూస్ )** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ పట్టణంలో శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివ పార్వతుల కళ్యాణ మహోత్సవం శుక్రవారం ఉదయం భక్తిశ్రద్ధలతో అద్భుతంగా జరిగింది. వేద మంత్రోచ్చారణల నడుమ, అర్చకుల మంత్రపఠనంతో స్వామి వారికి మంగళ వివాహం ఘనంగా నిర్వహించారు.శ్రీ స్వామివారి కళ్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తుల జయజయధ్వానాలు, మంగళ వాయిద్యాల నాదం ఆలయ పరిసరాలను మారుమ్రోగించాయి. వేదపండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన కల్యాణ మహోత్సవం భక్తుల హృదయాల్లో భక్తి తరంగాలను పుట్టించింది. ఉత్సవం సందర్భంగా స్వామివారి మూల విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు, అలంకారాలు నిర్వహించగా, కళ్యాణ వేదికను పుష్పాలతో అందంగా శోభాయమానంగా ముస్తాబు చేశారు. స్వామివారి కళ్యాణ సమయానికి ఆలయ ప్రాంగణం పుణ్యప్రవాహంగా మారింది. అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వామివారి పాణిగ్రహణ కార్యక్రమాన్ని నిర్వహించగా, భక్తులు ఆనందోత్సాహాలతో కాంక్షించి స్వామివారికి కర్పూర హారతులు సమర్పించారు. వేడుకకు భక్తుల కేరింతలు, శంఖనాదాలు విశేష శోభను చేకూర్చాయి. పుష్పవర్షం మధ్య భక్తుల కోలాహలంతో ముగిసిన శివ పార్వతుల కళ్యాణ మహోత్సవం భక్తుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా అనిపించింది.

# మంచుకొండ ఎత్తిపోతల పథకం పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. మంత్రి తుమ్మల



**ఖమ్మం/ రఘునాథ పాలెం, 14 మార్చి (క్రాంతిన్యూస్ ):** రైతులకు సాగునీరు అందించే మంచుకొండ ఎత్తిపోతల పథకం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంచుకొండ ఎత్తిపోతల పథకం పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ, రైతులకు సాగునీరు అందించేందుకు మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేసుకున్నామని అన్నారు. మంచుకొండ ఎత్తిపోతల పథకం పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి సంబంధిత అధికారులకు సూచించారు. ప్రాజెక్టు పనుల పురోగతి, ల్యాబ్, ప్రెజర్ మెయిన్స్, కంట్రోల్ ప్యానెల్స్, మోటార్ల ఏర్పాటు వంటి వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈ.ఈ, డి.ఈ లు జరుగుతున్న పనుల పురోగతిని మంత్రికి వివరించారు. మంచుకొండ ఎత్తిపోతల పథకానికి సంబంధించి మిగిలి ఉన్న ప్రెజర్ మెయిన్స్ పనులు మార్చి 25 లోపు పూర్తి చేస్తామని, మార్చి 17 నాటికి మొదటి స్లాబ్ నిర్మాణం అయిపోతుందని, ఆ తదుపరి నాగార్జున సాగర్ కాలువ నుంచి నీటిని తీసుకునేందుకు వీలుగా పనులు చేపడతామని అన్నారు. రైతులతో ఎటువంటి సమస్య లేకుండా సమన్వయం చేసుకుంటూ ఉండాలని, రైతుల పంటలకు నష్టం జరగకుండా పనులు వేగవంతం కావాలని మంత్రి అన్నారు. ఈ తనిఖీలలో మంత్రి వెంట నీటి పారుదల శాఖ ఈ.ఈ అనన్య, డీ.ఈ.ఈ ఝాన్సీ, ఏ.ఈ.ఈ శ్రీరామ్, రాజీవ్ గాంధీ, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.


# అంతకపేట లో ఫీనిక్స్ ఫౌండేషన్ శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం

**అక్కన్నపేట, 14 మార్చి (క్రాంతిన్యూస్ ):** ఫీనిక్స్ ఫౌండేషన్ జిల్లా అంధత్వ నివారణ సంస్థ శంకరా కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో హైదరాబాద్ నానక్ రాంగూడ వారు ఉచితకంటి వైద్యశిబిరం ఈ నెల 16వ తేదీ ఆదివారం రోజున సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం అంతకపేట




గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు ఈ కార్యక్రమం ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహిస్తారుఉచితంగా కంటి పరీక్షలు చేసి లోపం ఉన్న వారిని గుర్తించి కంటి చూపు మెరుగు పడేలా ఆపరేషన్ ద్వారా ఐ ఓ ఎల్ అమర్చనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు అంతే కాకుండా కంటిశుక్లం ఉన్న వారికి ఉచితంగా సర్జరీ చేస్తామని అదే రోజున హైదరాబాద్ వరకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని కంటి పరీక్షలకు హాజరయ్యే పేషంట్ ఆదార్ కార్డు జిరాక్స్ ఫోన్ ఏమైనా రోజు వాడే మందులు వారి వెంట తెచ్చుకోవాలని తలంటు స్నానం చేసి రావాలని విషయాన్ని సంబంధిత బంధు మిత్రులందరికి తెలియచేయలని తెలిపారు

# బిఆర్ఎస్ ఎమ్మెల్యేల మీద ఫైర్ అయిన మంత్రి పొన్నం



**హుస్నాబాద్, 14 మార్చి(క్రాంతిన్యూస్):** చట్టసభల్లో ప్రజాస్వామ్యానికి సభకు నాయకుడు ముఖ్యమంత్రి సభకు అధిపతి స్పీకర్ అటువంటి స్పీకర్ ని పట్టుకొని సభ మీ ఒక్కడిది కాదు అని మాట్లాడడం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం స్పీకర్ మీకు మళ్ళీ అవకాశం ఇచ్చి పొరపాటు అంటుంటే అవును మీది కాదు అని మాట్లాడుతూ కనీసం నన్ను సంప్రదించలేదు చెప్పుకోవడానికి అవకాశం కూడా ఇవ్వలేదు మాట్లాడుతున్నారుఇవన్నీ గమనిస్తున్న బి ఆర్ ఎస్ నాయకత్వం కూడా జగదీశ్వర్ రెడ్డి చేసింది తప్పు స్పీకర్ ని సభలో ఇలా మాట్లాడడం మంచిది కాదని చెప్పడం లేదుదానికి నిన్న ధర్నాలు చేయడం నియోజకవర్గాల్లో ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ప్రవర్తించిన వాళ్ళే ఈరోజు నిరసనలు తెలుపుతున్నారుఇది హాస్యాస్పదం ప్రజాస్వామ్య విలువలను కాపాడడానికి కనీసం జ్ఞానం రావాలిసభలో ఏవిధంగా ఉండాలి సభ వేదిక పై ఏ విధంగా ప్రవర్తించాలో తెలిసి కూడా ఇలా చేస్తున్నారంటే ఇది ఉద్దేశ్యపూర్వకంగా చేస్తున్నారు. ఇది ప్రజలు గమనించాలి సభకు కొన్ని సంప్రదాయాలు పద్ధతులు ఉంటాయి. ఉదాహరణకు అబద్ధం అనడానికి కూడా విలు లేదు సత్యదూరం అనాలిశాసన సభలో కొన్ని అంశాలు ఉన్నప్పుడు సభ మీ ఒక్కడిదా అంటే ఆయన శాసన సభకు అధిపతి అందులోనె అర్థం ఉందిదళితుడు కాబట్టి ఆ విధంగా వ్యవహరించారని మాట్లాడుతున్నారు. ఇదే బిఆర్ఎస్ గతంలో శాసన మండలి చైర్మన్ మీద కాగితాలు పడేసారని ఇద్దరు సభ్యులను తొలగించారు భర్తరఫ్ చేశారు ప్రజాస్వామ్యంలో ఇది మర్చిపోయారా ఇటువంటి మాటలు వద్దు ఇటువంటి నిరసనలు బిఆర్ఎస్ కి మంచిది కాదు

# పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

**నరసింహులపేట,14 మార్చి (క్రాంతిన్యూస్ ):** మండలంలోనిఅజ్మీరతండా జీపీ పరిధిలోని వాంకుడోతు తండాకు చెందిన వాంకుడోతు భీమా(46) ఫిబ్రవరి 23న భీమా భార్య బుజ్జి కుటుంబ తగదాలతోనిప్పటించుకుని చికిత్స పొందుతూ ఫిబ్రవరి 27న మృతి చెందింది. భార్య మృతి చెందడంతో మనస్థాపం చెందిన భీమా ఈ నెల 3న పురుగుల మందు తాగడంతో చికిత్స నిమిత్తం ఖమ్మం దవాఖనకు తరలించగా అక్కడ పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. దీంతో శుక్రవారం మృతి చెందినాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు స్థానిక ఎస్సై మాలోతు సురేష్ శుక్రవారం తెలిపారు

# జాయ్ ఫ్యామిలీ కిట్టి ఆధ్వర్యంలో హెూలీ వేడుకలు.

**ఖమ్మం, 14 మార్చి (క్రాంతిన్యూస్ ):** ఖమ్మం శ్రీనివాస్ నగర్ లో ఉన్న



ఆశ్రమం నందు జాయ్ ఫ్యామిలీ కిట్టి ఆధ్వర్యంలో హెూలీ వేడుకలు చాలా ఘనంగా నిర్వహించారు . ప్రేమానురాగాలతో, ఆత్మీయతలకు ప్రతీకగా రంగులు చల్లుకుంటు, బంధాలను చాటిచెబుతు సమైక్యతకు ప్రతిరూపంగా నిలిచే పండగ హెూలీని జరుపుకున్నారు . ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆయిల్ శాఖ అధ్యక్షుడు ప్రతాపని నర్సింహారావు, శైలజ, గణేష్, మహేష్, నీలిమ, వేముల కృష్ణ, అరుణ కుమార్, ఉష, చందు, స్వాతి, రిషిత, దేవరశెట్టి శైలజ తదితరులు పాల్గొన్నారు .

# హెూలీ సంబరాల్లో పర్వతగిరి ఎస్ఐ, మండల ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు



**పర్వతగిరి, 14 మార్చి (క్రాంతిన్యూస్ ):** మండల వ్యాప్తంగా శుక్రవారం హెూలీ పండుగ వేడుకలను ప్రజలు సంబరంగా జరుపుకున్నారు.మండల ప్రెస్ క్లబ్ సభ్యులు పర్వతగిరి ఎస్ఐ. ప్రవీణ్ తో కలిసి హెూలీ పండుగ జరుపుకున్నారు. ఏ వీధిలో చూసిన హెూలీ వేడుకలు కనువిందు చేశాయి. ముఖ్యంగా చిన్నారులు, యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హెూలీ శుభాకాంక్షలు తెలుపుకుని కేరింతలు కొడుతు ఆడారు. కొందరు ఆడిన తర్వాత చెరువులు, బావుల్లో స్నానం చేశారు. మరికొందరు దావత్ చేసుకున్నారు. రోజంతా సరదాగా గడిపారు.ఈ హెూలీ ఉత్సవ కార్యక్రమంలో పర్వతగిరి సబ్ ఇన్స్పెక్టర్ బి.ప్రవీణ్, ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షుడు మధురకోళ్ల నాగరాజు గౌరవ అధ్యక్షుడు కొల్లూరి నాగరాజు, ఉపాధ్యక్షులు ఎండి అజుమ్, కరిమిల్ల దుర్గారావు, కార్యదర్శి మునిగే శ్రీకాంత్, కోశాధికారి నాగుల రాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ శనిగరపు రంజిత్, ఇస్లావత్ దేవేందర్, భూక్య ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# హనుమకొండ లో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ కు ఏర్పాట్లను పరిశీలించిన మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు,ఎర్రబెల్లి దయాకర్ రావు,ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్.





**హనుమకొండ, 14 మార్చి (క్రాంతిన్యూస్ ):** హనుమకొండ జిల్లా బట్టుపల్లిలో ఏప్రిల్ 27న జరగనున్న బీఆర్ఎస్ బహిరంగ సభ కోసం వరంగల్‌లో మాజీ మంత్రులు హరీష్ రావు, ఎర్రబెల్లి.దయాకర్ రావు , జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి,ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, చల్లాధర్మా రెడ్డి, దాస్యం వినయ్ భాస్కర్, నన్నపునేని నరేందర్, ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలు ఉనికిచెర్ల,బట్టుపల్లి ప్రాంతాల్లోని సభా వేదిక స్థలాలను పరిశీలించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు సభ ఏర్పాట్లపై పార్టీ నేతలతో చర్చించి బహిరంగ సభకు అవసరమైన మార్పులు సూచనలను చేశారు. భారీ సంఖ్యలో ప్రజలు హాజరవనున్న నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లు సమగ్రంగా ఉండేలా చూడాలని ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులకు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు ఎస్సారెస్పీ కెనాల్ లో మృతి చెందిన మహిళ -కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ బి.ప్రవీణ్



**పర్వతగిరి, 14 మార్చి (క్రాంతిన్యూస్ ):** పర్వతగిరి మండల పరిధిలోని హట్యతండ గ్రామానికి చెందిన (ఎర్రకుంట తండా) బాదావత్ చంద్రు, తండ్రి కీ "శే" మీట్య, కులం లంబాడ వృత్తి: కూలి పని, ఫిర్యాదు మేరకు తన తల్లి మృతురాలు బాదావత్ నేజి గురువారం, సాయంత్రం అందాజ ఆరు గంటల సమయంలో ఎస్సారెస్పీ కాలువలో బట్టలు ఉతుకుదామని వెళ్లి ప్రమాదవశాత్తు జారిపడి కొట్టుకు పోయిందని, శుక్రవారం ఉదయం 7:30 గంటలకు బొల్లికొండ తండా నెక్కొండ మండలం ఎస్సారెస్పీ కాలువలో పైకి తేలి కనిపించినది. ఫిర్యాది కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా ఆమె చనిపోయి ఉన్నది. ఇట్టి విషయంపై పర్వతగిరి ఎస్సై బి.ప్రవీణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఏపీలో మండిపోతున్న ఎండలు

**-వేడిగాలులతో జనాల కష్టాలు - ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

ఆంధ్రప్రదేశ్‌లో సూర్యుడి భగభగలు కొనసాగుతున్నాయి.. రాష్ట్ర వ్యాప్తంగా మార్చి నెలలోనే గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి. సాధారణం కన్నా 3.5 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయని.. ప్రధానంగా కోస్తా, ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. పలు జిల్లాల్లో వేడిగాలుల తీవ్రత ఎక్కువగా ఉంది.. ఉత్తరాంధ్రలోని పార్వతీపురం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, ఎన్టీఆర్ జిల్లాల్లో వేడిగాలులు వీస్తున్నాయి. మరోవైపు శుక్రవారం భారీగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

నంద్యాల జిల్లా గోస్పాడులో 42.8 డిగ్రీలు, కర్నూలు జిల్లా ఉలింద కొండలో 42.6 డిగ్రీలు, ప్రకాశం జిల్లా గొల్లవిడిపి, విజయనగరం జిల్లా పెదనదిపల్లిలో 41.7 డిగ్రీలు, కడప జిల్లా మద్దూరులో 41.5 డిగ్రీలు, అన్నమయ్య జిల్లా కంబాలకుంట 41.1 డిగ్రీలు, అనకాపల్లి జిల్లా రావికమతం వడ్డాది, అనంతపురం జిల్లా నాగసముద్రంలో 41 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. ప్రజలు ఎండ తీవ్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గురువారం ప్రకాశం జిల్లా పెదదోర్నాలలో 42.4 డిగ్రీలు, అనకాపల్లి జిల్లా నాతవరంలో 42.1 డిగ్రీలు, పార్వతీపురంమన్యం జిల్లా పాచిపెంటలో 41.9 డిగ్రీలు, నంద్యాల జిల్లా రుద్రవరంలో 41.8 డిగ్రీలు, పల్నాడు జిల్లా అమరావతిలో 41.5 డిగ్రీలు, విజయనగరంలో 41.3 డిగ్రీలు, ఎన్టీఆర్ జిల్లా మోగులూరులో 40.6 డిగ్రీలు, చిత్తూరు జిల్లా గుడిపాలలో 40.3 డిగ్రీలు, తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగలో 40.2డిగ్రీల, కడప జిల్లా ఖాజీపేటలో 40.1 డిగ్రీలు, నెల్లూరు జిల్లా వరికుంటపాడులో 40 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు పత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున ప్రజలు ఎండ తీవ్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

తెలంగాణలో కూడా సూర్యుడి ప్రతాపం కొనసాగుతోంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని వాతావరణశాఖ చెబుతోంది. వచ్చే రెండు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకుపైగా నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.





## ఏసీబీ వలలో మరో అవినీతి అధికారి..

శ్రీకాకుళం 14 మార్చి (క్రాంతిన్యూస్ ): శ్రీకాకుళం బీసీ వెల్ఫేర్ ఆఫీసుకు చెందిన అసిస్టెంట్ బుడుమూరు బాలరాజు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఇంక్రిమెంట్లు ఎంట్రీ, బిల్లుల ప్రాసెస్ చేసే విషయంలో అదే శాఖకు చెందిన వివిధ బి.సి హాస్టల్లో పనిచేస్తే అటెండర్, కుక్ల నుంచి రూ.25 వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్గా పట్టుబడ్డాడు

## మర్రి చెట్ల పాలెం చేరుకున్న ప్రజా చైతన్య యాత్ర



ప్రకాశం 14 మార్చి (క్రాంతిన్యూస్ ): ప్రకాశం జిల్లా చీమకుర్తి ప్రజా చైతన్య యాత్ర లో భాగంగా సిపిఎం బృందం మర్రి చెట్ల పాలెం, నిప్పట్లపాడు పంచాయతీలో పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగా మర్రి చేట్లపాలెం ఎస్సీ కాలనీలో గుడి వద్ద బోరు రిపేర్ చేయించాలని సంవత్సరం నుండి అధికారులు పట్టించుకోలేదని, సైడ్ కాలవలో బూడిపోయి ఉన్నాయని వర్షాకాలం వస్తే ఎక్కడ నీరు అక్కడ నిలబడి పోతుందని పూడికలు తీయాలని కోరుతున్నారు. ఇల్ల మధ్యలో గుండాహై వోల్ట్ విద్యుత్ తీగలు ఉన్నాయని వాటిని పక్కకు మార్చాలని కోరుతున్నారు నిప్పట్లపాడు లో ఉపాధి కూలీలకు ఆరువారాల బిల్లులు బకాయిలు ఇవ్వాలని, పనిచేసినరోజులు స్లిప్పులు ఇవ్వాలి, పనిముట్లు ఇవ్వాలని కోరినారు. ఈ కార్యక్రమం లో సిపిఎం మండల కార్యదర్శి పల్లా పల్లి ఆంజనేయులు మండల నాయకులు శీలం ఆదినారాయణ, కంకణాల వెంకటేశ్వర్లు, నుగ్గ శ్రీను, జి ప్రభుదాస్, జి.చెన్నకేశవులు,ఎం శ్రీను, ఆదాము తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడుగా మోహన్ రెడ్డి......

**నెల్లూరు,14 మార్చి (క్రాంతిన్యూస్ ):** నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా నెల్లంబాకం మోహన్ రెడ్డిని , నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు నెల్లూరు జిల్లా కాంగ్రెస్ నాయకులు మోహన్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ తన రాజకీయ గురువు దేవకుమార్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటానని, అలాగే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిలా రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు...



## "మా రాముడు కథ"సినిమా పోస్టర్ విడుదల....

**నెల్లూరు,14 మార్చి (క్రాంతిన్యూస్):** నెల్లూరు నగరంలోని స్థానిక 25 కళా సంఘాల కార్యాలయం నందు 25 కళా సంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి "మా రాముడు కథ "సినిమా పోస్టర్ను విడుదల చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో 21 సినిమాలు షూటింగ్ జరుగుతున్నాయని అందులో భాగంగా తొమ్మిదవ చిత్రం లో హీరోగా నటిస్తున్న యువ నటుడు శ్రీరామ్ నటిస్తున్న ఈ చిత్రం కుటుంబ కథా చిత్రం పోస్టర్ను విడుదల చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్శకుడు యద్దనపూడి మైకేల్, నిర్మాత ప్రవీణ్ థామస్ వర్మ, సహ నిర్మాత ముప్పాళ్ళ శ్రీరామరాజు, సంగీతం వాసు, అసోసియేట్ డైరెక్టర్ నరేష్ యాదవ్, మేనేజర్ గా రాహుల్ యాదవ్ నేతృత్వంలో ప్రేమ కథ, కుటుంబ కథ చిత్రం గా ఈ నెల 24వ తేదీ షూటింగ్ ప్రారంభిస్తున్నారని కావున నెల్లూరు జిల్లా ప్రజలు చిన్న సినిమాలను ఆదరించాలని చిన్న సినిమాలకు సినిమా థియేటర్లు లభించేలా ప్రభుత్వం అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యువ నటుడు శ్రీరామ్, వాసు, మహేంద్ర, అమీర్జాన్, చిత్ర సాంకేతిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



## పవన్ కళ్యాణ్‌తో సినిమా తీయాలని నా కోరిక.. మనసులో మాట చెప్పిన మాజీ మంత్రి

**-మాజీ మంత్రి బాలినేని ఆసక్తికర వ్యాఖ్యలు**

**-పవన్ కళ్యాణ్‌తో సినిమా తీయాలని కోరిక**

**-ప్రాణం ఉన్నంత వరకు పవన్ కళ్యాణ్ వెంటే**




ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో సినిమా తీయాలనే కోరిక ఉందన్నారు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి. పిఠాపురం చిత్రాడలో నిర్వహించిన జనసేన 12వ ఆవిర్భావ సభలో మాజీ మంత్రి బాలినేని కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ప్రాణం ఉన్నంత వరకు పవన్ కళ్యాణ్‌తో ఉంటానని.. తాను ఏ పదవి ఆశించి జనసేన పార్టీలో చేరలేదన్నారు. తాను పవన్‌ను కలిసిన సమయంలో కొందరు.. బాలినేని కూటమిని విడగొడతాడని ప్రచారం చేశారని.. పవన్‌కు తనవల్ల చెడ్డపేరు రాకూడదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చర్చించుకొని కష్టపడి పనిచేసిన జనసేన కార్యకర్తలకు గుర్తింపు ఇచ్చేలా చొరవ చూపాలని.. తన ధ్యేయం పవన్ కళ్యాణ్ ఇంకా ఎదగాలి.. ఆయనతో సినిమా తీయాలని కోరిక ఉందన్నారు.

తనకు అవకాశం ఇస్తే ప్రకాశం జిల్లాలోని జిల్లా పరిషత్ ఛైర్మన్‌తో సహా అందరినీ జనసేనలోకి తీసుకువస్తానన్నారు బాలినేని శ్రీనివాసరెడ్డి. 'జనసేన కార్యకర్తలను చాలా మందిని నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదు.. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇద్దరూ కుర్చొని ఎమ్మెల్యేలందరికీ దిశానిర్దేశం చేయాలి. జనసేన కార్యకర్తలకు రేషియో ప్రకారం పదవుల ఇవ్వకపోతే ఎన్నికల సమయానికి వారు ప్రశ్నిస్తారు. వారి బాధ ఎలాంటిదో అప్పుడు తెలుస్తుంది. పవన్ కల్యాణ్?తో సినిమా తీయాలనేది నా చిరకాల కోరిక. దాన్ని నెరవేర్చుకుంటా. వైఎస్ఆర్ పార్టీని వీడుతానని ఎవ్వరూ ఊహించలేదు. బాలినేని మంచివారని ప్రతిపక్షంలో ఉండగా పవన్ అన్నారు. అప్పుడే జనసేనలో చేరకపోవడం నా దౌర్భాగ్యమని' అన్నారు.

'పిఠాపురం అమ్మవారి సాక్షిగా అన్నీ నిజాలే చెబుతాను.. జగన్ నా ఆస్తులనూ కాజేశారు. నాకు జరిగిన అన్యాయం ఒక్కరోజు చెబితే సరిపోదు. జగన్ చేసిన అన్యాయాలన్నీ త్వరలోనే చెబుతా. మా నాన్న ఇచ్చిన ఆస్తిలో సగంపైనే అమ్ముకున్నాను.. లెక్క చేయలేదు. సవాల్ చేస్తున్నా. అప్పటి ఎమ్మెల్యేలందరిపైనా విచారణ వేయండి. నామీదా వెయ్యండి. ఎవరు తప్పు చేశారో, రూ.కోట్లు సంపాదించారో తేలుతుంది. ఈ ఉక్రోషం, బాధ నాకు, నా కుటుంబానికి తెలుసు. నాకు రాజశేఖరరెడ్డి, ఎన్టీఆర్ అంటే ఇష్టం. రాజకీయ భిక్ష పెట్టిన రాజశేఖరరెడ్డికి విధేయతతో మంత్రి పదవి నాలుగేళ్ల కాలం ఉండగానే వదిలేసి జగన్ వెంట నడిచా. మంత్రి పదవి ఇచ్చి తీసేసినా బాధపడలేదు.. ఆ పదవి డోంట్‌కేర్' అన్నారు.

'రఘురామకృష్ణరాజు ఏదో మాట్లాడితే ఆయన్ను లోపల పెట్టించి కాళ్లు, చేతులు విరగ్గొట్టించారే.. 17 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు భార్య గురించి మాట్లాడితే వారికి బాధ కలగదా. దీనిపై ఆ రోజే తాను అసెంబ్లీలో ఖండించాను. పవన్ కళ్యాణ్ గురించి పోసానితో మాట్లాడించారు.. ఆయన పవన్ తలచుకుంటే లక్షల మంది జనసైనికులతో తుక్కుతుక్కుగా కొట్టించేవారన్నారు. కుటుంబం గురించి అలా మాట్లాడినందుకే తొమ్మిది నెలల తర్వాత అరెస్టు చేశారని, అదే తానైతే ప్రభుత్వం వచ్చిన మర్నాడే లాఠీతో రాలగొట్టించి లోపల వేయించేవాడిని. పవన్ కల్యాణ్ గురించి జగన్ మాట్లాడుతూ కౌన్సిలర్‌కు ఎక్కువ అన్నారు. అయ్యా జగన్ మీ నాన్న దయతో ముఖ్యమంత్రి అయ్యావు.. మళ్లీ అవ్వ చూద్దాం' అన్నారు.

## ఏపీలో దేశంలోనే అతిపెద్ద క్రికెట్ గ్రౌండ్



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాజధాని అమరావతిపై ఫుల్ ఫోకస్ పెట్టింది.. త్వరలోనే నిర్మాణ పనులు చేపట్టేందుకు సిద్ధమవుతోంది. వరుసగా టెండర్లను ఖరారు చేస్తోంది.. త్వరలోనే నిర్మాణ పనుల్ని ప్రారంభించేందుకు ముహూర్తం ఫిక్స్ చేయనున్నారు. ఈ క్రమంలో అమరావతిని స్పోర్ట్స్ సిటీగా కూడా డెవలప్ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే కీలక నిర్ణయం తీసుకుంది. అమరావతిలో ఏకంగా 220 ఎకరాల్లో స్పోర్ట్స్ యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని ప్లాన్ చేస్తోంది. ఈ యూనివర్శిటీతో పాటుగా అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు సంబంధించి విజయవాడ ఎంపీ, ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు కేశినేని శివనాథ్ (చిన్ని) కీలక వ్యాఖ్యలు చేశారు.

విజయవాడ తూర్పు నియోజకవర్గం సిద్ధార్థ నగర్ 7వ లైన్‌లో ది పికిల్ బాల్ రిపబ్లిక్ పేరుతో ఏర్పాటు చేసిన పికిల్ బాల్ కోర్టులను కేశినేని చిన్ని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావుతో కలిసి ప్రారంభించారు. పికిల్ బాల్ క్రీడపై యువకులు విపరీతంగా ఆసక్తి చూపిస్తున్నారని.. అమరావతి రాజధాని ప్రాంతంలో ఇలాంటి ఎన్నో అకాడమీలు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. విజయవాడ, గుంటూరు, తెనాలి, అమరావతి, మంగళగిరి ప్రాంతం యువకులకు పిల్లలకు మెరుగైన క్రీడా సదుపాయాలు రాబోతున్నాయని తెలిపారు. అమరావతిలో రాబోయే రోజుల్లో 220 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ స్పోర్ట్స్ యూనివర్సిటీ రాబోతోందని.. అమరావతి స్పోర్ట్స్ సిటీలోనే అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణం కూడా జరగనుందన్నారు. స్పోర్ట్స్ యూనివర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం 142 ఎకరాలు కేటాయించిందన్నారు.

అమరావతిలో స్పోర్ట్స్ యూనివర్శిటీ ఏర్పాటుతో పాటు అందులో శిక్షకులు, ఫిజియోథెరపిస్టులు, సిబ్బందిని నియమిస్తామని, మెరుగైన వసతులు కల్పిస్తామని స్పష్టం చేశారు కేశినేని చిన్ని. క్రీడా అకాడమీలకు స్థలాలు కేటాయిస్తామన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో 220 ఎకరాల్లో క్రీడా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసి యువతను అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతామన్నారు. రాబోయే రోజుల్లో క్రీడలకు మరింతగా ప్రాధాన్యం ఇస్తామన్నారు.

ఇటీవలో అమరావతిలో అతిపెద్ద అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణంపై మంత్రి నారా లోకేష్ కూడా స్పందించారు. లోకేష్ దుబాయ్‌లో గత నెలలో జరిగిన ఇండియా, పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించారు. ఈ క్రమంలో దుబాయ్‌లో ఐసీసీ ఛైర్మన్ జైషాతో లోకేష్ సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో క్రికెట్ సదుపాయాల అభివృద్ధిపై ఆయనతో చర్చించినట్లు లోకేష్ ట్వీట్ చేసిన సంగతి తెలిసిందే. లోకేష్ వెంట ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎంపీలు కేశినేని శివనాథ్ (చిన్ని), సానా సతీష్ కూడా ఉన్నారు. అహ్మదాబాద్‌లా అమరావతిలోనూ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మించనున్నట్లు లోకేష్ ట్వీట్ చేశారు. దీనికి ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ అంగీకారం తెలిపిందన్నారు. జైషాతో సమావేశంలో స్టేడియం నిర్మాణం, సీటింగ్ తదితరాలను పరిశీలించి జైషాతో మాట్లాడానన్నారు.

# ఎర్ర జెండాలను నామరుపాలు లేకుండా చేస్తామనడం నరేంద్ర మోడీకి తగదు



**హుస్నాబాద్, 14 మార్చి (క్రాంతిన్యూస్ ):** గత బిఆర్ఎస్ కెసిఆర్ పాలనలో తెలంగాణ ఉద్యమ కారులకు అన్యాయం చేశారు. తెలంగాణ సాయుధ పోరాట యోధులు సిఎం రెవంత్ రెడ్డి సర్కారు గుర్తించాలి సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డిదేశంలో 2026 నాటికి ఎర్ర జెండాలను నామరుపాలు లేకుండా చేస్తామనడం బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వానికి తగదని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారుశుక్రవారం నాడు హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గుట్టల్లో అనభేరి సింగిరెడ్డి అమరుల డెబ్బై ఏడోవ వర్ధంతి సందర్భంగా అసువులు బాసిన తెలంగాణ సాయుధ పోరాట యోధుల స్మారక స్థూపం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి అనంతరం భూషణ గట్లల్లో అమరులైన అనభేరి ప్రభాకర్ రావు సింగిరెడ్డి భూపతిరెడ్డితో పాటు మరో పది మంది అమరులు ముస్కు చోక్కరెడ్డి , ఏలేటి మల్లారెడ్డి అయిరెడ్డి భూంరెడ్డి,తూమోజు నారాయణ ,నల్లగొండ దామోదర్ రెడ్డి,ఇల్లందుల పాపయ్య,పోరెడ్డి రాంరెడ్డి, నల్లగొండ రాజారాం,సిక్కోడు సాయిలు, రొడ్ల మాధవరెడ్డి తోపాటు మహ్మదపుర్ గ్రామ మాజీ సర్పంచ్ పిట్టల వెంకన్న అసువులు బాసిన సమాధుల వద్ద పూలమాలలు వేసి చాడ వెంకటరెడ్డి శ్రద్ధాంజలి ఘటించారు అనంతరం చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం లేకుండా నేడు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చేది కాదని గత బిఆర్ఎస్ కెసిఆర్ పాలనలో తెలంగాణ సాయుధ పోరాట యోధులు తెలంగాణ ఉద్యమ కారులకు అన్యాయం చేశారని నేడు కాంగ్రెస్ ప్రజా పాలనలో ముఖ్యమంత్రి రెవంత్ రెడ్డి పాలనలొ తెలంగాణ సాయుధ పోరాట యోధులకు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో పని చేసిన ఉద్యమ కారులకు న్యాయం జరిగేలా సాయుధ పోరాట యోధుల పేరు చరిత్ర పుటల్లో లిఖించే విదంగా హైదరాబాద్ లో అమరవీరుల స్మృతి వనం విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి ఎనుముల రెవంత్ రెడ్డి అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని చాడ వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్,సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు హుస్నాబాద్ సిపిఐ మండల కార్యదర్శి గడిపె మల్లేశ్,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జాగీర్ సత్య నారాయణ,యెడల వనేష్ కిష్టపురం లక్ష్మణ్,అందే అశోక్,హుస్నాబాద్ నియోజకవర్గ నాయకులు నాగేల్లి లక్ష్మారెడ్డి,గూడేం లక్ష్మి,ముద్రకొల రాజయ్య, అందే చిన్న స్వామి, బత్తుల బాబు,చాడ శ్రీదర్ రెడ్డి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అయిలేని సంజీవరెడ్డి కొయడకొమురయ్య, పిట్టల బాలయ్య, ఎగ్గోజు సుదర్శన్ చారి, బొజ్జపూరి రాజు, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జనగాం రాజ్ కుమార్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు రామగల్ల నరేష్, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి పిట్టల ప్రసాద్,మాజీ ఎంపిటిసి సభ్యులు పిట్టల సుధాకర్, సిపిఐ మండల నాయకులు అయిలేని మల్లారెడ్డి, మౌటం బాలయ్య, పొదిల కుమారస్వామి, ఇంద్రాల మల్లయ్య, అనభేరి ప్రభాకర్ రావు మనవరాల్లు భావాని,వాసంతి తదితరులు పాల్గొన్నారు అనంతరం సామాజిక ఉద్యమకారుడు ప్రకృతి పర్యావరణం విశ్లేషకులు మండల జంపయ్య రాసిన అనభేరి సింగిరెడ్డి అమరుల పాటను,గడిపె మల్లేశ్, బొనగిరి శ్రీకాంత్, జక్కి మంజుల గానం చేసిన పాటల సిడిని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ఆవిష్కరించారు.

# గ్రామా,గ్రామాన ఘనంగా హెూలీ వేడుకలు



**రాయపర్తి,14మార్చి(క్రాంతిన్యూస్ ):** రంగుల పండుగ హెూలీ వేడుకలను పురస్క రించుకొని శుక్రవారం మండలం లోని రాయపర్తి,మైలారం,జగన్నాథపల్లి, సన్నూరు తదితర గ్రామాల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలను చిన్న పెద్ద తేడా లేకుండా సహజ రంగులను పూసుకొని రంగులకేళి రంగేళిని ఎంతో సంబరంగా జరుపుకున్నారు. వెంకటేశ్వరపల్లి గ్రామంలోని చిన్నారులు సహజ రంగులను పూసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## గరుడ వాహనంపై విహరించిన లక్ష్మీనరసింహస్వామి




**గీసుకొండ, 14మార్చి (క్రాంతిన్యూస్):** గీసుకొండ మండలంలోనిశ్రీ కొమ్మాల లక్ష్మీ నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ స్వామివారు పౌర్ణమి సందర్భంగా గరుడ వాహనంపై విహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, కార్యనిర్వహణాధికారి అద్దంకి నాగేశ్వర్ రావు, ఉత్సవ కమిటీ చైర్మన్ కడారి రాజు, సభ్యులు, అర్చకులు రామాచార్యులు, విష్ణు, ఫణీంద్రాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా హెూలీ సంబరాలు

**ముస్తాబాద్14 మార్చ్ (క్రాంతిన్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని గ్రామాలలో హెూలీ పండుగ ఘనంగా నిర్వహించారు. గురువారము రోజున రాత్రి పలుచోట్ల ప్రజా ప్రతినిధులు గ్రామ పెద్దలు యువకులు కామ దహనం కార్యక్రమం నిర్వహించారు. ఊరు వాడ రంగుల్లో తడిసి ముద్ద ఎందుకు రంగులతో సిద్ధమై నేడు హెూలీ పర్వదినాన్ని పురస్కరించుకొని, ముస్తాబాద్ మండల కేంద్రంలో సాహస సిద్ధమైన రంగులతో ఒకరిపై ఒకరు చల్లుకుంటూ యువకులు నాయకులు అందరూ కలిసి స్నేహాన్ని గుర్తుగా ప్రేమతో సంతోషంగా హెూలీ పండుగ ఘనంగా నిర్వహించారు.

# టీ డిఎఫ్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు మిషన్ కీట్స్ అందజేత



ముస్తాబాద్ 14 మార్చ్ క్రాంతిన్యూస్ : తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం వనిత చేత ప్రాజెక్టులో భాగంగా గత సంవత్సరం ముస్తాబాద్ లో ఉచిత టైలరింగ్ క్యాంపు ప్రారంభించబడినది ఎవరైతే ఈ క్యాంపులో శిక్షణ తీసుకుంటున్నారు వారిని ప్రోత్సహించడానికి మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం యూఎస్ఏ అట్లాంటా చాప్టర్ వారి సహకారంతో మహిళలకు ఉచిత టైలరింగ్ కీట్స్ ఉచితంగా అందజేయడం జరిగింది. శిక్షణ తీసుకుంటున్న మహిళలు మంచిగా ట్రైనింగ్ తీసుకొని పాస్ అయితే రానున్న రోజుల్లో వారికి సిరిసిల్ల టెక్స్టైల్ పార్క్ అదేవిధంగా సిరిసిల్ల ప్రాంతంలో ఉన్న టెక్స్టైల్ ఇండస్ట్రీ తో అనుసంధానం చేసి వారికి బిజినెస్ ఆర్డర్స్ కోసం తప్పకుండా కృషి చేస్తానని టిడిఎఫ్ ఇండియా ప్రెసిడెంట్ మట్ట రాజేశ్వర్ రెడ్డి తెలిపారు అదేవిధంగా గత బ్యాచ్ కి ఎవరైతే అడ్మిషన్ రాలేదో వచ్చే కొత్త బ్యాచ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు ,ఈ యొక్క సదా అవకాశాన్ని ముస్తాబాద్ మండల మహిళలు వినియోగించాల్సిందిగా రాజశేఖర్ రెడ్డి కోరారు. కొత్త అడ్మిషన్స్ కోసం ఎవరైతే ఆసక్తి ఉన్నారో వారు ముస్తాబాద్ పాల కేంద్రం వద్ద ఉన్న టిడిఫ్- సమర్థ ట్రైనింగ్ సెంటర్ వద్దకు వచ్చి సంబంధించిన డాక్యుమెంట్స్ ట్రైనింగ్ సెంటర్ ఇన్చార్జ్ సునీత ఇవ్వాల్సిందిగా తెలియజేశారు. ఉచిత కీట్స్ ప్రోగ్రాం కి సహకరించిన టీడిఎఫ్ యూఎస్ఏ అట్లంట చాప్టర్ అధ్యక్షులు తోట గణేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడిఎఫ్ యూఎస్ఏ మాజీ అధ్యక్షులు డాక్టర్ దినేష్ అని రెడ్డి టీడిఎఫ్ యూఎస్ఏ అట్లంట చాప్టర్ మేంబర్ వాణి గడ్డం , టీడిఎఫ్ ఇండియా మహిళా అధ్యక్షురాలు టీ.వాణి టీడిఎఫ్ ఇండియా ప్రెసిడెంట్ మట్ట రాజేశ్వర్ రెడ్డి టైలరింగ్ క్యాంప్ ఇంచార్జ్ సునీత పాల్గొనడం జరిగింది.

# సప్తవర్ణ హెూళీ - కెమిస్ట్ ల ఆనందాల కేళి

## కొత్తగూడెం లో కెమిస్ట్ ల హెూళీ సంబురాలు



**భద్రాద్రి కొత్తగూడెం,14 మార్చి (క్రాంతిన్యూస్ ):** కొత్తగూడెం లో నీ కెమిస్ట్ లందరూ హెూళీ వేడుక ను కొత్తగూడెం లో నీ కెమిస్ట్ భవన్ నందు ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. అన్ని రంగుల కలయికే మనిషి జీవితం అని, ఒకరిని ఒకరు రంగులు పూసుకుంటూ డ్యాన్స్ లు చేస్తూ హెూలీ సంబురాలు చేసుకున్నారు. ప్రజలు అందరూ సుఖ సంతోషాలతో జీవితాన్ని గడపాలని తెలియజేశారు.

# వైభవంగా.. శ్రీనివాసుడి కళ్యాణం..

- భారీగా తరలివచ్చిన భక్తులు
- విద్యుత్తుకాంతులతో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం
- పాల్గొన్న డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్.

**నర్సింహులపేట,14 మార్చి (క్రాంతిన్యూస్ ):** మండల కేంద్రం శివారు ఇంద్రకీలాద్రి పర్వతంపై కొలువుదీరిన పద్మావతి సహిత అలివేలు మంగ శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది.జిల్లా ఆలయ దేవస్థానం ఈవో వేణుగోపాల్ పర్యవేక్షణలో వేద పండితులు శ్రీనివాసచార్యులు, కేశవాచార్యులు, ప్రధాన అర్చకులు శ్రీ నందనాచార్యులు, రాంబాబు ఆచార్యుల బృందం ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయం గర్భగుడి పైనుంచి కిందకు తీసుకోవచ్చి పల్లెకిపై ఎక్కించారు. ఖమ్మం పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి తల్లాడ రమేష్, ఉషారాణి తెప్పించిన అలంకరణ సామాగ్రితో అలంకరించారు. మహబూబాబాద్ పార్లమెంటు సభ్యుడు బలరాం నాయక్, డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచందర్ నాయక్ దంపతులు



అతిథులుగా పాల్గొని గరుడ వాహనంపై స్వామివారిని ఊరేగిస్తూ ఎదుర్కోలు కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకంటే ముందుగా ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్ సతీమణి ప్రమీల పుట్టినరోజు వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు మండలం నుంచే కాకుండా వివిధ పొరుగు జిల్లాల నుండి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా



ప్రధాన కార్యదర్శి బొబ్బ సోమిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ వివిధ మండలాల అధ్యక్షులు జినుకల రమేష్, పెండ్లి రఘువీరారెడ్డి, కరుణాకర్ రెడ్డి, బట్టు నాయక్, మూడు మండలాల ఇంఛార్జి, సీనియర్ నాయకులు కాలం రవీందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ బత్తిని శ్రీనివాస్ యాదవ్, గ్రామ శాఖ అధ్యక్షుడు కదుదల రామకృష్ణ, యూత్ అధ్యక్షుడు పొన్నం శ్రీకాంత్, దశ్రు నాయక్, చిర్ర సతీష్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, భక్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.







# మీ ఊపిరితిత్తులు క్లీన్ అవ్వాలంటే

## రోజూ వీటిని తీసుకోండి..

హెల్త్‌న్యూస్,14మార్చి(క్రాంతిన్యూస్): ప్రస్తుతం మనం కాలుష్యభరితమైన వాతావరణంలో నివసిస్తున్నాం. ఒకప్పుడు కేవలం నగరాలకు మాత్రమే పరిమితం అయిన కాలుష్యం ఇప్పుడు గ్రామాలకు కూడా వ్యాపించింది. దీంతో ఎక్కడ చూసినా స్వచ్ఛమైన గాలిని పీల్చలేకపోతున్నాం. గాలిలో ఉండే అనేక కాలుష్య కారకాలు మన ఊపిరితిత్తుల్లోకి చేరి మనకు రోగాలను కలగజేస్తున్నాయి. మానవుడు చేస్తున్న అనేక తప్పుల వల్లే గాలిలో కాలుష్యం పెరుగుతుందని నిపుణులు కూడా చెబుతున్నారు. అలాంటి కాలుష్య పూరితమైన వాతావరణంలో నివసిస్తున్నందున ఊపిరితిత్తులు తీవ్ర అనారోగ్య సమస్యలకు గురవుతున్నాయి. చాలా మందికి కాలుష్యం కారణంగా ఊపిరితిత్తుల క్యాన్సర్ కూడా వస్తోంది. అయితే ఇలాంటి పరిస్థితిలో ప్రతి ఒక్కరూ ఊపిరితిత్తులను ఆరోగ్యంగా ఉంచుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందులో భాగంగానే ఆహారంలో పలు మార్పులు చేసుకోవాలని వారు సూచిస్తున్నారు.



పసుపు..

కొన్ని రకాల ఆహారాలను మనం నిత్యం తీసుకుంటే దాంతో ఊపిరితిత్తులు శుభ్రంగా మారుతాయి. ఊపిరితిత్తులు అనారోగ్యాల బారిన పడకుండా రక్షించుకోవచ్చు. మనం రోజూ పసుపును అనేక వంటల్లో వాడుతుంటాం. ఊపిరితిత్తులను శుభ్రం చేయడమే కాకుండా వాపులను తగ్గించడంలోనూ పసుపు అద్భుతంగా పనిచేస్తుంది. పసుపును రోజూ పాలలో కలిపి రాత్రి పూట సేవిస్తుండాలి. లేదా పసుపు వేసి మరిగించిన నీళ్లను కూడా తాగవచ్చు. పసుపులో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి, ఇందులో ఉండే కర్క్యుమిన్ అనే సమ్మేళనం కాలుష్యం కారణంగా వ్యర్థాలతో నిండిన ఊపిరితిత్తులను బాగు చేస్తుంది. దీంతో ఊపిరితిత్తులు శుభ్రమవుతాయి. అలాగే బెర్రీలను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల కూడా ఊపిరితిత్తులను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

బెర్రీలు..

బ్లూ బెర్రీలు, స్ట్రాబెర్రీలు, చెర్రీలు, రాస్ప్ బెర్రీలను తరచూ తినాలి. వీటిల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో కణాకు జరిగే నష్టం నివారించబడుతుంది. దీని వల్ల ఊపిరితిత్తులు శుభ్రంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. పోషకాహార నిపుణులు చెబుతున్న ప్రకారం పాలకూరలో మన శరీరానికి ఉపయోగపడే అనేక పోషకాలు ఉంటాయి. ఇందులో అనేక విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. దీంతో ఊపిరితిత్తుల్లోని వ్యర్థాలు, టాక్సిన్లు బయటకు పోయి ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉంటాయి. వెల్లుల్లి కూడా ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది. వెల్లుల్లిలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. వెల్లుల్లిని తింటే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. అలాగే కాలుష్యం కారణంగా ఏర్పడిన వ్యర్థాలను ఊపిరితిత్తుల నుంచి తొలగిస్తుంది. దీంతో ఊపిరితిత్తులు క్లీన్ అవుతాయి. రోజూ 2 వెల్లుల్లి రెబ్బలను పరగడుపునే తింటుంటే మేలు జరుగుతుంది.

అల్లం..

అల్లంలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇది యాంటీ ఆక్సిడెంట్‌లా కూడా పనిచేస్తుంది. అందువల్ల రోజూ 2 సార్లు ఉదయం, సాయంత్రం భోజనానికి ముందు కాస్త అల్లం రసం సేవించాలి. లేదా అల్లం ముక్కను నీటిలో వేసి మరిగించి కూడా తాగవచ్చు. దీంతో కాలుష్యం వల్ల వాపులకు గురైన ఊపిరితిత్తులు తిరిగి సాధారణ స్థితికి చేరుకుంటాయి. ఊపిరితిత్తుల్లోని కాలుష్య కారకాలు బయటకు వెళ్లిపోయి ఆయా భాగాలు ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే గ్రీన్ టీని రోజూ తాగుతున్నా కూడా ఊపిరితిత్తులను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. గ్రీన్ టీలో పాలిఫినాల్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఊపిరితిత్తులను శుభ్రం చేస్తాయి. గుండెను కూడా ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇలా పలు రకాల ఆహారాలను రోజూ తీసుకోవడం వల్ల ఊపిరితిత్తులు క్లీన్ అయి ఆరోగ్యంగా ఉంటాయి. ఊపిరితిత్తుల క్యాన్సర్ రాకుండా చూసుకోవచ్చు.

# బిల్వ పత్రంలో ఔషధ గుణాలు, ఎలా ఉపయోగపడతాయి?



హెల్త్ న్యూస్,14 మార్చి (క్రాంతిన్యూస్ ): బిల్వ పత్రంలో ఔషధ గుణాలున్నాయి. ఈ ఆకును మారేడు ఆకు అంటారు. బిల్వ పత్రం అతిసార, మొలలు, చక్కెర వ్యాధిగ్రస్తులకు ఎంతో మేలు చేస్తుంది.మారేడులో విటమిన్లు ఎ, బి1, బి2, సి, ఖనిజాలు, కాల్షియం, పొటాషియం, ఇనుముతో కూడిన అనేక పోషకాలున్నాయి.బిల్వ పత్రంలో కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండటం వల్ల ఇది శరీరానికి తగినంత శక్తిని అందిస్తుంది. బిల్వ పత్రంలో పొటాషియం సమృద్ధిగా ఉండటం వల్ల రక్తపోటుతో బాధపడేవారికి మేలు చేస్తుంది.మారేడు ఆకులలో ధమనులు గట్టిపడకుండా నిరోధించే గుణం వుంది. గుండె జబ్బులను నివారిస్తుంది.మారేడులో ఉండే కాల్షియం దంతాలు, ఎముకలను బలోపేతం చేయడానికి, బోలు ఎముకల వ్యాధిని నివారిస్తుంది.బిల్వలో వుండే ఇనుము రక్తంలో ఎర్ర రక్త కణాలు, హిమోగ్లోబిన్ కౌంట్‌ను పెంచుతుంది.మారేడుతో గుండె- కాలేయ వ్యాధులకు వ్యతిరేకంగా శక్తివంతంగా పనిచేస్తుంది. అధిక కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది.

# ఇదేం చేస్తుందిలే అనుకునేరు.. సిక్రెట్ తెలిస్తే జింగ్ జింగ్

## అమేంజింగ్ అంతే.. అస్సలు వదిలిపెట్టరు

హెల్త్ న్యూస్,14 మార్చి (క్రాంతిన్యూస్ ):మన వంటగదిలో సాధారణంగా ఉపయోగించే మసాలా దినుసుల్లో లవంగం ఒకటి.. లవంగాలు మంచి సువానతోపాటు ఘాటుగా ఉంటాయి.. ఇవి ఆహార రుచిని పెంచడమే కాకుండా ఆరోగ్యానికి కూడా చాలా ప్రయోజనకరంగా ఉంటాయి.. లవంగాలను శతాబ్దాలుగా భారతీయ, ఆసియా వంటకాల్లో ఉపయోగిస్తున్నారు.. వాటి రుచి, వాసన, ఔషధ గుణాలకు ప్రసిద్ధి చెందాయి. అయితే.. లవంగాలు శరీరానికి అనేక రకాలుగా మేలు చేస్తాయి.. అనేక రకాల శరీర సమస్యలను నయం చేయడానికి ఆయుర్వేదంలో లవంగాల ప్రస్తావన ఉంది.. దీనిని శక్తివంతమైన ఔషధంగా పేర్కొంటారు ఆయుర్వేద నిపుణులు.. లవంగాల చిన్న మొగ్గలను సుగంధ ద్రవ్యంగా మాత్రమే కాకుండా ఆయుర్వేద వైద్యంలో కూడా ఉపయోగిస్తారు. ఇది శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ, నొప్పి నివారిణిగా పనిచేస్తుంది.



లవంగాలు వేడి స్వభావాన్ని కలిగి ఉంటాయి.. ముఖ్యంగా శీతాకాలంలో దీనిని తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. లవంగాలలో విటమిన్ కె, ఫోలేట్, మాంగనీస్, పొటాషియం, బీటా కెరోటిన్ వంటి ఇతర ముఖ్యమైన ఖనిజాలు వంటి అనేక పోషకాలు ఉంటాయి. ఈ మూలకాల కలయిక వివిధ శరీర భాగాలు సరిగ్గా పనిచేయడానికి సహాయపడుతుంది.. ఇంకా అనేక వ్యాధులను నివారించేందుకు ఉపయోగపడుతుంది.

జీవక్రియ: లవంగాలు తినడం వల్ల శరీరంలో జీవక్రియ పెరుగుతుంది. లవంగాలలో లభించే యూజినాల్ వంటి అంశాలు శరీర కొవ్వును కాల్చడంలో సహాయపడతాయి.. ఇది బరువు తగ్గడానికి సహజ నివారణగా పనిచేస్తుంది. లవంగాలలో లభించే యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని ఫ్రీ రాడికల్స్ నుండి రక్షిస్తాయి. అంతేకాకుండా, లవంగాల వినియోగం శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తుంది, ఇది వృద్ధాప్య ప్రక్రియను నెమ్మదిస్తుంది మరియు గుండె జబ్బులు, క్యాన్సర్, మధుమేహం వంటి తీవ్రమైన వ్యాధుల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది.

లవంగం నూనె: వైద్యశాస్త్రంలో కూడా లవంగం నూనెకు ముఖ్యమైన స్థానం ఉంది. ఆయుర్వేదంలో, లవంగం నూనెను అనేక వ్యాధుల చికిత్సకు ఉపయోగిస్తారు. దీని యాంటీ బాక్టీరియల్ %-% యాంటీ ఫంగల్ లక్షణాల కారణంగా, దీనిని పంటి నొప్పి, చిగుళ్ల వాపు, ఇన్ఫెక్షన్ల చికిత్సలో ఉపయోగిస్తారు. లవంగం నూనె ఒక సహజ మత్తుమందు (తిమ్మిరి కలిగించే ఏజెంట్) లాంటిది.. ఇది పంటి నొప్పిని తగ్గించడంలో సహాయపడుతుంది. దీనితో పాటు, ఇది కడుపు పూతలను నయం చేయడంలో కూడా సహాయపడుతుంది. లవంగం నూనె తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది.. కడుపు సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది.

రక్తంలో చక్కెర: లవంగాల వల్ల కలిగే మరో ప్రయోజనం ఏమిటంటే.. ఇది రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుంది. ఎలుకలపై నిర్వహించిన ప్రయోగాలలో, లవంగం సారం ఇన్సులిన్ నిరోధకతను తగ్గిస్తుందని, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుందని పరిశోధకులు కనుగొన్నారు. ఈ పరిశోధన లవంగాల వినియోగం మధుమేహ రోగులకు ప్రయోజనకరంగా ఉంటుందని రుజువు చేస్తుంది.

క్యాన్సర్: క్యాన్సర్‌కు వ్యతిరేకంగా లవంగాల ప్రయోజనాలపై కూడా పరిశోధనలు జరిగాయి. లవంగాలలో లభించే మూలకాలు కణాలకు జరిగే నష్టాన్ని తగ్గిస్తాయని, క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయని అనేక పరిశోధనలు చూపిస్తున్నాయి. లవంగం సారం అనేక రకాల క్యాన్సర్ కణాల పెరుగుదలను నెమ్మదిస్తుంది.. క్యాన్సర్ చికిత్సలో కూడా సహాయపడుతుంది. పెద్దప్రేగు, రొమ్ము, ఇతర రకాల క్యాన్సర్ కణాలకు వ్యతిరేకంగా లవంగం సారం ప్రభావవంతంగా ఉంటుందని నిరూపించబడింది.


కాలేయ ఆరోగ్యం: దీనితో పాటు, లవంగాల వినియోగం కాలేయ పనితీరును మెరుగుపరచడంలో కూడా సహాయపడుతుంది. లవంగాలలో లభించే యూజినాల్ కాలేయానికి మేలు చేస్తుంది.. కాలేయాన్ని శుభ్రపరచడంలో సహాయపడుతుంది. దీని వినియోగం కాలేయ సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది.. కొవ్వు కాలేయం %-% సిర్రోసిస్ లక్షణాలను తగ్గిస్తుంది.

లవంగాల ప్రయోజనాలు

లవంగాలు అనేక ప్రయోజనాలను కలిగి ఉన్నాయి.. కానీ దాని అధిక వినియోగం కూడా కొన్ని హానికరమైన ప్రభావాలను కలిగిస్తుంది. లవంగం నూనెలో అధిక మొత్తంలో యూజినాల్ ఉంటుంది.. దీనిని పెద్ద పరిమాణంలో తీసుకుంటే శరీరంపై విషపూరిత ప్రభావాలను చూపుతుంది. ముఖ్యంగా పిల్లలకు లవంగం నూనె మరింత హానికరం. దీనితో పాటు, లవంగం రక్తాన్ని పలుచబరిచే మందులతో కలిపినప్పుడు ప్రమాదకరమైన ప్రభావాలను కలిగిస్తుంది. కాబట్టి లవంగం తినేటప్పుడు అది ఏ ఔషధ వినియోగాన్ని ప్రభావితం చేయకుండా చూసుకోవడం ముఖ్యం..

వైద్యుడు లేదా ఆయుర్వేద నిపుణులను సంప్రదించడం మంచిది..

లవంగాలు తినడం వల్ల సహజమైన %-% సురక్షితమైన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. మీరు ఏదైనా వైద్య ప్రయోజనం కోసం లవంగం లేదా దాని నూనెను తీసుకోవాలంటే.. వైద్యుడిని లేదా ఆయుర్వేద నిపుణుడిని సంప్రదించడం మంచిది.



# క్రీడలు




## ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా అక్షర్ పటేల్..



స్పోర్ట్స్ న్యూస్,14 మార్చి (క్రాంతిన్యూస్ ): ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ .. ఐపీఎల్ ఫ్రాంచైజీ ఢిల్లీ క్యాపిటల్స్‌కు కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. ఈ యేటి ఐపీఎల్‌లో ఆ జట్టు సారధిగా బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. కెప్టెన్సీ నుంచి రిషబ్ పంత్ తప్పుకోవడంతో.. అతని స్థానంలో అక్షర్ పటేల్ ను ప్రకటించారు. 31 ఏళ్ల అక్షర్ 2019 నుంచి ఢిల్లీ జట్టుకు ఆడుతున్నాడు. అతన్ని 16.50 కోట్లకు ఆ జట్టు రిటేన్ చేసుకున్నది.

గతంలో గుజరాత్ జట్టుకు కెప్టెన్‌గా చేసిన అనుభవం అక్షర్‌కు ఉంది. ఈ ఏడాది ఆరంభంలో భారత టీ20 జట్టుకు వైస్ కెప్టెన్సీ బాధ్యతలు కూడా నిర్వర్తించాడు. గత సీజన్‌లో అతను ఢిల్లీ జట్టు తరఫున 235 రన్స్ స్కోర్ చేశాడు. 11 వికెట్లను కూడా తన ఖాతాలో వేసుకున్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు సారధిగా వ్యవహరించడం గౌరవంగా భావిస్తున్నట్లు అక్షర్ తెలిపాడు. ఓ క్రికెటర్‌గా ఎదిగానని, కెప్టెన్సీ చేపట్టేందుకు విశ్వాసంతో రెడీగా ఉన్నట్లు తెలిపాడు.

వాస్తవానికి ఢిల్లీ జట్టుకు కేఎల్ రాహుల్ కెప్టెన్సీ చేపడుతాడన్న ఊహాగానాలు వినిపించాయి. కానీ ఆ పాత్రను పోషించేందుకు రాహుల్ సముఖంగా లేనట్లు తెలిసింది. రిషబ్ పంత్ కెప్టెన్సీ చేపట్టేందుకు నిరాకరించడంతో.. అక్షర్‌ను ఆ ఛాన్స్ వరించింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఇప్పటి వరకు 150 మ్యాచ్‌లు ఆడాడు అక్షర్. అతను మొత్తం 1653 రన్స్ చేశాడు. 123 వికెట్లు తీశాడు.

## ముంబయి ఇండియన్స్‌కు షాక్...
## కెప్టెన్ హార్దిక్ పాండ్యాపై నిషేధం..!

స్పోర్ట్స్ న్యూస్,14 మార్చి (క్రాంతిన్యూస్ ): ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 ఈ నెల 22న మొదలవనున్నది. కోల్‌కతా నైట్ రైడర్స్-రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మధ్య మ్యాచ్‌తో ప్రారంభమవుతుంది. ఈ సీజన్‌లో ముంబయి ఇండియన్ మార్చి 23న తొలి మ్యాచ్‌ను చెన్నైలోని చిదంబరం స్టేడియంలో చెన్నై సూపర్‌కింగ్స్‌తో మ్యాచ్ ఆడనున్నది. మ్యాచ్‌కు ముందే ముంబయికి షాక్ తగిలింది. ఈ మ్యాచ్‌కు కెప్టెన్‌కు హార్దిక్ పాండ్యా దూరం కానున్నాడు. మ్యాచ్ నిషేధం కారణంగా తొలి మ్యాచ్‌కు దూరమవనున్నాడు.



**పాండ్యాపై ఎందుకు ఒక మ్యాచ్ నిషేధం?**

హార్దిక్ పాండ్యా గత సీజన్‌లోనే ముంబయి కెప్టెన్‌గా చేశాడు. అతని కెప్టెన్సీలో ముంబయి జట్టు చెత్త ప్రదర్శనతో పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో నిలిచింది. అంతే కాకుండా పాండ్యా కెప్టెన్సీలో లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్‌కు మూడోసారి స్లో ఓవర్ రేట్ కారణంగా ఐపీఎల్ పాలకవర్గం జరిమానా విధించింది. నిబంధనల ప్రకారం.. మూడుసార్లు స్లో ఓవర్ గురవడంతో కెప్టెన్‌కు రూ.30లక్షల జరిమానాతో పాటు మ్యాచ్ నిషేధం విధిస్తారు.

గ్రూప్ దశలోనే ముంబయి ఇండియన్స్ స్లో ఓవర్ రేట్‌కు గురైంది. ఆ జట్టు ప్లేఆఫ్‌లోకి ప్రవేశించకపోవడంతో హార్దిక్ పాండ్యాపై నిషేధం సాధ్యం కాలేదు. ఈ క్రమంలో ఐపీఎల్ 2025 సీజన్‌లో తొలి మ్యాచ్‌లోనే నిషేధాన్ని ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఎదురైంది. దాంతో చెన్నైతో జరిగే మ్యాచ్‌కు పాండ్యా దూరం ఉండాల్సి రానున్నది. ఇక పాండ్యాపై నిషేధం నేపథ్యంలో ముంబయి ఇండియన్స్ కెప్టెన్‌గా ఎవరు బాధ్యతలు స్వీకరిస్తారనే చర్చ జరుగుతున్నది.

గాయం కారణంగా ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా ఆడేది అనుమానమే. ఈ పరిస్థితుల్లో సూర్య కుమార్ యాదవ్, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మలో ఎవరు కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరిస్తారనే చర్చ సాగుతున్నది. టీ20 క్రికెట్‌లో సూర్య కుమార్ యాదవ్‌కు మంచి రికార్డు ఉన్నది. అతని కెప్టెన్సీలో టీమిండియా 18 మ్యాచుల్లో.. కేవలంలో నాలుగు మ్యాచుల్లోనే ఓడిపోయింది. ఈ క్రమంలో సూర్య కుమార్ యాదవ్‌కు కెప్టెన్సీ బాధ్యతలు ఇచ్చే అవకాశాలున్నాయి. ఈ విషయంలో టీమ్ మేనేజ్‌మెంట్ స్పందించలేదు.

## రిషబ్ పంత్ టాప్ వికెట్ కీపర్లలో ఒకడు..
## ప్రశంసించిన వెస్టిండిస్ మాజీ కెప్టెన్ దినేష్ రామ్‌దిన్

స్పోర్ట్స్ న్యూస్,14 మార్చి (క్రాంతిన్యూస్ ): టీమిండియా స్టార్ వికెట్ కీపర్, స్టార్ బ్యాటర్ రిషబ్ పంత్‌ను వెస్టిండీస్ మాజీ కెప్టెన్ దినేశ్ రామ్‌దిన్ ప్రశంసలతో ముంచెత్తాడు. ప్రపంచంలోని టాప్ వికెట్ కీపర్‌లలో ఒకడని పేర్కొన్నారు. పంత్ ఐపీఎల్‌లో లక్నో తరఫున బరిలోకి దిగనున్న విషయం తెలిసిందే. మార్చి 22 నుంచి ఐపీఎల్ మొదలవనున్నది. చాలాకాలం పాటు ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున బరిలోకి దిగిన రిషబ్.. తాజాగా లక్నో సూపర్ జెయింట్స్ తరఫున బరిలోకి దిగుతున్నాడు. లక్నో యాజమాన్యం కెప్టెన్‌గా నియమించిన విషయం తెలిసిందే. వెస్టిండీస్ మాజీ కెప్టెన్ మాట్లాడుతూ.. పంత్ బ్యాటింగ్, పరుగులు చేసే విధానం ప్రత్యేకమైందని చెప్పాడు. ఆస్ట్రేలియా నుంచి జోష్ ఇంగ్లిస్ సైతం చాంపియన్స్ ట్రోఫీలో రాణించాడని చెప్పారు.



వెస్టిండీస్ తరఫున 71 టెస్టులు, 139 వన్డేలు, 74 టీ20లు ఆడిన 40 రామ్‌దిన్.. గిల్‌క్రిస్ట్ వికెట్ కీపర్ల ప్రమాణాలను మార్చాడని పేర్కొన్నారు. గతంలో వికెట్ కీపర్స్ కేవలం.. కీపర్స్ మాత్రమేనని.. కానీ, క్రికెట్ ప్రస్తుతం చాలా అభివృద్ధి చెందిందని.. కీపర్ పాత్ర బ్యాట్స్‌మెన్‌గా విస్తరించిందని చెప్పాడు. ఇది ఆడమ్ గిల్‌క్రిస్ట్ వంటి ఆటగాళ్లతోనే మొదలైందని.. కీపర్‌గా, బ్యాట్స్‌మెన్‌గా రాణించాడని చెప్పారు. క్వింటన్ డి కాక్, బ్రెండన్ మెకల్లమ్, మహేంద్ర సింగ్ ధోని వంటి ప్లేయర్స్ వికెట్ కీపర్ రోల్‌ను కొత్త శిఖరాలకు తీసుకెళ్లారని పేర్కొన్నారు.

## అందరూ ఇండియన్సే..
## ప్యాట్ కమ్మిన్స్ ఒక్కడే




స్పోర్ట్స్ న్యూస్,14 మార్చి (క్రాంతిన్యూస్ ): ఇండియన్ ప్రీమియర్ లీగ్ (IPL 2025) కి రంగం సిద్ధమైంది. మార్చి 22న ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఈ క్యాష్‌రిచ్ లీగ్‌కు తెరలేవనుంది. ఈ ఏడాది సీజన్ కోసం మొత్తం పది ఫ్రాంచైజీలు తమ కెప్టెన్‌ల వివరాలను ప్రకటించాయి. ఇప్పటివరకు మొత్తం తొమ్మిది ఫ్రాంచైజీలు తమ సారధులను ఖారారు చేయగా.. ఢిల్లీ క్యాపిటల్స్ ఒక్కటే బ్యాలెన్స్ ఉండేది. ఇప్పుడు ఢిల్లీ క్యాపిటల్స్ కూడా తమ కొత్త కెప్టెన్‌గా అక్షర్ పటేల్ పేరును ప్రకటించడంతో అభిమానుల నిరీక్షణకు తెరపడింది.

కమ్మిన్స్ ఒక్కడే..

కాగా ఐపీఎల్-2025లో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. ఈ ఏడాది సీజన్‌లో మొత్తం పది జట్లు తలపడనున్న సంగతి తెలిసిందే. అందులో తొమ్మిది జట్ల కెప్టెన్‌లగా భారత్ ఆటగాళ్లు వ్యవహరించనుండగా.. ఒక్క సన్‌రైజర్స్ హైదరాబాద్‌కే విదేశీ ఆటగాడు సారథిగా ఉండనున్నాడు.

టోర్నమెంట్ మొత్తం ఎడిషన్‌లో ఏకైక విదేశీ కెప్టెన్‌గా కమ్మిన్స్ నిలిచాడు. గతసీజన్‌లో మాత్రం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్, ఎస్ఆర్‌హెచ్‌లకు విదేశీ కెప్టెన్‌లు ఉన్నారు. కాగా కమ్మిన్స్ గత సీజన్‌లో కూడా ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్గా వ్యవహరించాడు.

అతడి సారథ్యంలో సన్‌రైజర్స్ అద్భుతాలు సృష్టించింది. అయితే అనూహ్యంగా ఆఖరి మెట్టుపై బోల్తా పడింది. గత కొన్ని రోజులగా క్రికెట్‌కు దూరంగా ఉంటున్న ఈ ఆస్ట్రేలియా కెప్టెన్ ఐపీఎల్‌తో తిరిగి మైదానంలో అడుగుపెట్టనున్నాడు. అతడు త్వరలోనే సన్‌రైజర్స్ బృందంలో చేరనున్నాడు.

ఐపీఎల్-2025లో కెప్టెన్‌లు వీరే..

చెన్నై సూపర్ కింగ్స్- రుతురాజ్ గైక్వాడ్
ఢిల్లీ క్యాపిటల్స్- అక్షర్ పటేల్
గుజరాత్ టైటాన్స్- శుబ్‌మన్ గిల్
కోల్‌కతా నైట్ రైడర్స్- అజింక్య రహానే
లక్నో సూపర్ జెయింట్స్- రిషబ్ పంత్
ముంబై ఇండియన్స్- హార్దిక్ పాండ్య
పంజాబ్ కింగ్స్- శ్రేయాస్ అయ్యర్
రాజస్థాన్ రాయల్స్- సంజు సామ్సన్
రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు- రజత్ పాటిదార్
సన్‌రైజర్స్ హైదరాబాద్- ప్యాట్ కమ్మిన్స్

# రెట్రో కోసం సొంతంగా డబ్బింగ్ చెప్పిన పూజాహెగ్డే



మూవీ న్యూస్,14 మార్చి (క్రాంతిన్యూస్ ):సమకాలీన కథానాయికల్లో చాలా మంది తమ సొంత గొంతుతో డబ్బింగ్ చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. తెరపై పాత్ర సహజంగా కనిపించడంతో పాటు అభిమానులకు కూడా మరింత చేరువకావొచ్చనే ఉద్దేశ్యంతో ఓన్ డబ్బింగ్‌కే ప్రాధాన్యతనిస్తున్నారు. ఇప్పటికే రష్మిక మందన్న, కీర్తి సురేష్ వంటి అగ్రతారలు డబ్బింగ్ కోసం సొంత గళాన్ని అందిస్తున్నారు. ఇప్పుడు వీరి వరుసలో పూజాహెగ్డే చేరింది. ప్రస్తుతం ఈ భామ తమిళంలో సూర్య సరసన 'రెట్రో' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. కార్తిక్ సుబ్బరాజ్ దర్శకుడు. మే నెలలో విడుదలకానుంది.

ఈ సినిమా కోసం పూజాహెగ్డే తమిళంలో సొంతంగా డబ్బింగ్ చెప్పింది. కెరీర్ తొలిసారి తాను సొంతంగా డబ్బింగ్ చెప్పడం ఆనందంగా ఉందని, ఇక ముందు అన్ని భాషల్లో ఇదే పద్ధతి ఫాలో అవుతానని పూజాహెగ్డే పేర్కొంది. తెలుగు సినిమాల్లో కూడా ఆమె ఓన్ డబ్బింగ్ చెప్పేందుకు సముఖంగా ఉందని తెలిసింది. గతకొంతకాలంగా సరైన విజయం కోసం ఎదురుచూస్తున్న పూజాహెగ్డే ప్రస్తుతం తమిళ ఇండస్ట్రీపైనే దృష్టి పెట్టింది. అక్కడ సూర్య 'రెట్రో', దళపతి విజయ్ 'జన నాయగన్', రాఘవ లారెన్స్ 'కాంచన-4' చిత్రాల్లో కథానాయికగా నటిస్తున్నది. ఈ సినిమాలు దక్షిణాదిన తనకు పూర్వ వైభవం తెచ్చిపెడతాయని ధీమా వ్యక్తం చేస్తున్నది పూజాహెగ్డే.



## 'పరదా'లో ప్రత్యేక అతిథి?

మూవీ న్యూస్,14 మార్చి (క్రాంతిన్యూస్ ):మరికొద్ది రోజుల్లో 'మా ఇంటి బంగారం'గా ప్రేక్షకుల్ని పలకరించడానికి సిద్ధమవుతుంది అగ్రతార సమంత. ప్రస్తుతం ఓవైపు వెండితెరపై మెప్పిస్తూనే.. ఓటీటీ వేదికగా భిన్నమైన కథలతో తీరిక లేకుండా గడుపుతున్న ఈ భామ.. ఇప్పుడు అతిథి పాత్రలో సినీప్రియుల ముందుకు రాబోతున్నట్లు తెలుస్తుంది. అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో ప్రవీణ్ కంద్రేగుల తెరకెక్కిస్తున్న చిత్రం 'పరదా'. లేడీ ఓరియెంటెడ్‌గా ముస్తాబవుతున్న ఈ చిత్రంలో సమంత ( ఓ ప్రత్యేక పాత్రలో తళుక్కున మెరవనున్నట్లు సమాచారం. ఈ పాత్ర సినిమాకు ప్రధాన ఆకర్షణగా ఉండనుందని.. మునుపెన్నడూ చూడని గెటప్పులో సమంత కనిపించనుందని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి . సంగీత, దర్శనా రాజేంద్రన్ తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## తండేల్ దర్శకుడితో రామ్ సినిమా..?



మూవీ న్యూస్,14 మార్చి (క్రాంతిన్యూస్ ):హీరో రామ్ ప్రస్తుతం మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. 'మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి' ఫేమ్ మహేష్‌బాబు దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం రాజమండ్రిలో షూటింగ్ జరుగుతున్నది. ఇదిలావుండగా తాజాగా రామ్ మరో చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఫిల్మ్‌సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. దీనిని చందు మొండేటి డైరెక్ట్ చేస్తారని సమాచారం. ఇటీవల 'తండేల్'తో బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టారు చందూ మొండేటి. ఆయన తదుపరి చిత్రాన్ని తమిళ హీరో సూర్యతో చేయాల్సి ఉంది. కథా చర్చలు కూడా పూర్తయ్యాయి.


అయితే ప్రస్తుతం సూర్య వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆయన డేట్స్ కోసం వెయిట్ చేయాల్సిన పరిస్థితి ఉంది. ఈలోగా రామ్‌తో ఆయన సినిమా చేసే ప్రయత్నాల్లో ఉన్నారని తెలిసింది. ఇటీవలే రామ్‌ని చందూ మొండేటి కలిసి ఓ కాన్సెప్ట్ చెప్పారని, అది బాగా నచ్చడంతో రామ్ సినిమా చేయడానికి ఉత్సాహంగా ఉన్నారని ఫిల్మ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. మైత్రీ మూవీ మేకర్స్ సినిమా పూర్తయ్యాక చందూ మొండేటి సినిమా పట్టాలెక్కే అవకాశముందని సమాచారం.

## అందులో భాగం అవుతున్నందుకు భయంగా ఉంది..



మూవీ న్యూస్,14 మార్చి (క్రాంతిన్యూస్ ):సినీ బ్యాగ్రౌండ్ నుండి వచ్చినప్పటికీ తన టాలెంట్ తో అనతి కాలంలోనే బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా గుర్తింపు తెచ్చుకుంది అలియా భట్. చివరగా వేదాంగ్ రైనా ప్రధాన పాత్రల్లో వాసన్ బాలా దర్శకత్వంలో తెరకెక్కిన 'జిగ్రా' మూవీతో అలరించింది. ఈ సినిమా దసరా కానుకగా అక్టోబర్ 11న ప్రేక్షకుల ముందుకు రాగా హిందీ తో పాటు తెలుగులో కూడా రిలీజ్ అయిన ఈ లేడీ ఓరియెంటెడ్ యాక్షన్ సినిమాకు డివైడ్ టాక్ వచ్చింది. ప్రస్తుతం 'ఆల్ఫా' సినిమాతో తీరిక లేకుండా గడుపుతోంది ఈ భామ. ఇక మూవీస్ విషయం పక్కన పెడితే గత సంవత్సరం 'మెట్‌గాలా' లో అదరగొట్టిన అలియా ఇప్పుడు మరో ఇంటర్నేషనల్ ఈవెంట్ కు రెడీ అవుతోంది.

త్వరలో కేన్స్ చిత్రోత్సవాల్లో సందడి చేయడానికి ముస్తాబవుతుంది అలియా. ఇందులో భాగంగా తాజాగా ముంబైలో జరిగిన ఒక మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ 'నేను 'ఆల్ఫా' కోసం ఎంతగానో ఎదురు చూస్తున్నాను. మే 13 నుంచి మే 24, 2025 వరకు జరగబోయే 78వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఇండియన్ స్టార్స్ ఎప్పటి నుంచో వస్తున్నారు. ఐశ్వర్య రాయ్ బచ్చన్, దీపికా పదుకొణె, సోనమ్ కపూర్ లాంటి వాళ్ళు రెగ్యులర్‌గా వస్తుంటారు. సినిమా ఇండస్ట్రీలో ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే గొప్ప పండుగ ఇది. ఈ ఏడాది ఇందులో నేను భాగం కావడం కొంచెం భయంగానే ఉంది కానీ.. కేన్స్‌లో తొలి అడుగు చేయబోతున్నందుకు ఉత్సాహంగా ఉన్నాను' అని చెప్పుకొచ్చింది అలియా.



## చిరంజీవికి మరో అరుదైన గౌరవం

మూవీ న్యూస్,14 మార్చి (క్రాంతిన్యూస్ ):అగ్ర కథానాయకుడు చిరంజీవి కి మరో అరుదైన గౌరవం దక్కింది. నాలుగు దశాబ్దాలకు పైగా సినీ రంగానికి అందిస్తోన్న విశేష సేవలను గుర్తిస్తూ ఆయన్ని హౌస్ ఆఫ్ కామన్స్ - యూకే పార్లమెంట్‌లో ఘనంగా సత్కరించనుంది. యూకే అధికార లేబర్ పార్టీ ఎంపీ నవేందు మిశ్రా ఆధ్వర్యంలో మార్చి 19న ఈ సన్మాన కార్యక్రమం జరగనుంది. మరోవైపు, ఇదే కార్యక్రమంలో బ్రిడ్జ్ ఇండియా సంస్థ చిరంజీవిని ప్రత్యేకంగా సత్కరించనుంది. సినీ రంగంలోనే కాకుండా సేవా కార్యక్రమాల్లోనూ ఎప్పుడూ ముందుండే ఆయనకు జీవిత సాఫల్య పురస్కారం అందించనుంది.

'పునాదిరాళ్ళు'తో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు చిరంజీవి. కెరీర్ ఆరంభంలో ఎన్నో సవాళ్లు, అవమానాలు ఎదుర్కొని స్టార్ హీరోగా ఎదిగారు. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ తనదైన నటన, డ్యాన్సులతో యువతను ఉర్రూతలూగించారు. బాక్సాఫీస్ రికార్డులు క్రియేట్ చేశారు. 9 ఫిలింఫేర్, 3 నంది అవార్డులతోపాటు ఎన్నో ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకున్నారు. సినీ రంగానికి ఆయన చేస్తున్న సేవలు గుర్తించిన ప్రభుత్వం 2006లో ఆయనకు పద్మభూషణ్, 2024లో పద్మవిభూషణ్ అందించి గౌరవించింది. ఇటీవల గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో ఆయన చోటు దక్కించుకున్నారు. 156 చిత్రాలు.. 537 పాటలు.. 24 వేల స్టెప్పులతో అలరించినందుకు ఈ రికార్డు దక్కింది. ఇక సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం ఆయన 'విశ్వంభర' కోసం వర్క్ చేస్తున్నారు. వశిష్ట దర్శకత్వంలో ఇది తెరకెక్కుతోంది. 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో కొత్త ప్రాజెక్ట్‌కు ఓకే చెప్పారు

Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com